
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 32.5, కనిష్ఠం 18.4
కామారెడ్డి
జిల్లా వార్తలు
5
శనివారం 29 మార్చి 2025





కామారెడ్డి మెడికల్ కళాశాల

మళ్లీ తెరపైకి.. పోస్టుల భర్తీ లొల్లి!

- మెడికల్ కళాశాల ఔట్ సోర్సింగ్ పోస్టుల భర్తీ ప్రక్రియలో నిబంధనలు బేఖాతారు
- నిబంధనలు తుంగలో తొక్కి నచ్చిన వారికి పోస్టింగ్‌లు ఇచ్చుకున్నారనే ఆరోపణలు
- మెరిట్ లిస్ట్ ప్రదర్శించకుండానే ఉద్యోగ నియామక పత్రాల అందజేత
- శుక్రవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన నిరుద్యోగులు, విద్యార్థి సంఘాల నాయకులు
- రోల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించకపోవడంతో ఇప్పటికే ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు పలువురి ఫిర్యాదు
- దీంతో కొద్దిరోజులు నియామకాలపై కాలయాపన
- 50 పోస్టులకు 45 మందికి మాత్రమే నియామక పత్రాల అందజేత
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన పలువురు దరఖాస్తుదారులు

కామారెడ్డి టౌన్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): డిగ్రీలు చదివి కూలీ పనులకు వెళ్లలేక కొందరు ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల వైపు మొగ్గుచూపుతున్నారు. దీంతో ఏ నోటిఫికేషన్ వచ్చినా.. దరఖాస్తు చేసుకుంటూ.. కనీసం ఔట్ సోర్సింగ్ ఉద్యోగమైన రాకపోతుందా? అని ఆశ పడుతూ నోటిఫికేషన్ రాగానే అడిగిన ప్రతీ సర్టిఫికెట్ జత చేసి ఆశగా ఎదురుచూస్తున్న వారికి చివరికి నిరాశే ఎదురవుతోంది. ఇలా జిల్లాలోని ఏదో ఒక శాఖలో ఈ తతంగం పలుమార్లు కనిపిస్తుండగా.. ప్రస్తుతం కామారెడ్డి మెడికల్ కళాశాలలో పోస్టుల భర్తీ ప్రక్రియలో కనిపిస్తోంది. కళాశాల నూతనంగా ఏర్పడడంతో అవసరమైన పోస్టుల కోసం ప్రతీ ఏడాది కొన్ని ఔట్‌సోర్సింగ్ పోస్టులను భర్తీ చేస్తూ వస్తున్నారు. అయితే ఈ నియామకాలలో నిబంధనలు బేఖాతారు చేయడంతో నిరుద్యోగులు కోర్టులకు, ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ల మెట్లు ఎక్కడం, అలాగే కలెక్టర్‌కు, ఇన్‌చార్జి మంత్రికి ఫిర్యాదులు చేసే వరకు వెళ్తోంది. ఇప్పటికే ఈ భర్తీ ప్రక్రియపై పలుమార్లు 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనాలు అందించడంతో జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు సీరియస్ అయిన విషయం విధితమే. పారదర్శకంగా ఎలాంటి లోటుపాట్లు లేకుండా భర్తీ ప్రక్రియ చేపట్టాలని సూచించినా నిర్లక్ష్యం జరుగుతుంది. పైగా నిబంధనలు పాటించకపోవడంతో నిరుద్యోగులు మళ్లీ రోడ్డు మీదకు వచ్చే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. గత మూడురోజుల కిందట మెడికల్ కళాశాలలో 50 పోస్టుల భర్తీకి సంబంధించి ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ 45 మందికి నియామక పత్రాలు అందించడంలో నిబంధనలు పాటించలేదంటూ మళ్లీ మెడికల్ కళాశాల పోస్టుల భర్తీ లొల్లి తెరమీదకు వచ్చింది.




● శుక్రవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు కలెక్టరేట్‌కు వచ్చిన నిరుద్యోగులు, విద్యార్థి సంఘా నాయకులు

రోల్ ఆఫ్ రిజర్వేషన్‌పై ఫిర్యాదులు

మెడికల్ కళాశాల ఏర్పాటు అయినప్పటి నుంచి ఇప్పటికీ ఔట్ సోర్సింగ్ పోస్టుల భర్తీకి రెండు దఫాలుగా నోటిఫికేషన్‌లు వేశారు. కాగా ఇందులో గత రెండేళ్ల కిందట పలు పోస్టులను నింపారు. ఆ తర్వాత గత ఏడాది మరో నోటిఫికేషన్ వేసి 50 పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేశారు. అయితే ఈ నోటిఫికేషన్ ప్రక్రియను ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ నోటిఫికేషన్ జారీ చేసి దరఖాస్తులు తీసుకోవాల్సి ఉండగా.. నిబంధనలకు విరుద్ధంగా మెడికల్ కళాశాల ద్వారా నోటిఫికేషన్ జారీ చేసి దరఖాస్తుల ప్రక్రియను చేపట్టారు. చివరకు పలువురు నిబంధనలు అతిక్రమించారని కోర్టు మెట్లు ఎక్కడంతో నోటిఫికేషన్ రద్దు చేశారు. ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా భర్తీ ప్రక్రియ చేపట్టేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. గతంలో ఉన్న ఏజెన్సీకి కాకుండా మరో ఏజెన్సీకి భర్తీ ప్రక్రియకు అనుమతి ఇవ్వగా.. ఆ ఏజెన్సీకి తగిన అర్హతలు లేవని, ఉపాధి కల్పన శాఖ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా సదరు ఏజెన్సీకి కేటాయింపులు చేశారని ఆరోపణలు వచ్చాయి. దీంతో కలెక్టర్, ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర ఉపాధి కల్పన అధికారికి ఫిర్యాదులు వెళ్లాయి. ఈ వ్యవహారంపై 'ఆంధ్రజ్యోతి'లో పలు కథనాలు రావడంతో ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించగా.. కొద్దిరోజుల పాటు నియామక ప్రక్రియను నిలిపివేశారు. మరికొందరు రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించకపోవడంతో మాకు అన్యాయం జరిగిందని ఎస్సీ, ఎస్టీ కమిషన్ మెట్లు ఎక్కడంతో.. కమిషన్ జిల్లా అధికారులకు నోటీసులు జారీ చేసింది. దీంతో మరి కొన్నిరోజులు నియామక ప్రక్రియలో జాప్యం జరిగింది. అయితే గతంలో ఇక్కడ పనిచేసి ఆరోపణలు ఎదుర్కొన్న ఉపాధి కల్పన అధికారి.. బదిలీపై వెళ్లడంతో హన్మకొండ నుంచి మరో అధికారి ఇన్‌చార్జిగా వచ్చారు. ఆ తర్వాత కొద్దిరోజుల్లోనే నియామక ప్రక్రియ వేగవంతం కావడంతో దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగుల్లో ఆశలు చిగురించాయి. ఈసారి ప్రతీ నిబంధనను కచ్చితంగా అమలు చేసి పోస్టులను భర్తీ చేస్తారని ఆశ పడ్డారు. కానీ మళ్లీ గతంలో మాదిరిగానే వారికి నిబంధనలు తుంగలో తొక్కి నచ్చినవారికి డబ్బులు తీసుకుని ఉద్యోగాలు కేటాయించారని ఆరోపణలు గుప్పిస్తూ.. పలువురు నిరుద్యోగులు, విద్యార్థి నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదులు చేశారు.

మెరిట్ లిస్ట్ ప్రదర్శించకుండానే..

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ ప్రక్రియకు సంబంధించి నోటిఫికేషన్‌ను ఉపాధి కల్పన అధికారి కార్యాలయం ద్వారా గుర్తింపు పొందిన ఏజెన్సీల నిర్వాహకులే చేయాల్సి ఉంటుంది. కానీ మెడికల్ కళాశాలలో మొదటి నుంచి అక్కడి ఉద్యోగులు కొందరు ఇష్టారీతిన వ్యవహరించడంతో నియామకాల ప్రక్రియకు సంబంధించి నిరుద్యోగుల నుంచి వ్యతిరేకత వస్తూనే ఉంది. మొదటిసారి ఉద్యోగాల భర్తీ చేపట్టినప్పుడు ఇష్టారీతిన అందులో పని చేసే ఓ అధికారి ఉపాధి కల్పన శాఖ సిబ్బందితో కలిసి ఉద్యోగ నోటిఫికేషన్ లేకుండానే భర్తీ చేపట్టి ఏజెన్సీకి భర్తీ చేసిన ఉద్యోగాల లిస్ట్ అందించారు. అప్పట్లో అసలు నోటిఫికేషన్ అనేది విడుదల చేయకపోవడం, రూల్ ఆఫ్ రిజర్వేషన్‌లు అమలు చేయకపోవడం, లక్షల్లో ముడుపులు తీసుకుని ఉద్యోగాలు భర్తీ చేశారనే ఆరోపణలు వచ్చాయి. ఆ తర్వాత రెండో నోటిఫికేషన్ గత సంవత్సరం వేయగా.. మళ్లీ మెడికల్ కళాశాల సిబ్బందే ప్రక్రియను మొదలుపెట్టడంతో రచ్చ మొదలైంది. చివరకు కొన్నినెలల పాటు ఉద్యోగాల భర్తీ ప్రక్రియ ఆగిపోయింది. అయితే మళ్లీ భర్తీ ప్రక్రియ మొదలుకాగా.. ఏజెన్సీ నిర్వాహకుడు దరఖాస్తులు తీసుకుని మెడికల్ కళాశాలకు అందించాడు. అందులో మెరిట్‌లిస్టు, స్క్రూట్నీ చేసి లిస్టును కళాశాలలో ప్రదర్శించి అబ్జక్షన్‌లు తీసుకోవాల్సి ఉండగా.. అది చేపట్టకుండానే ఉద్యోగ నియామక పత్రాలు అందించారని నిరుద్యోగులు ఆరోపిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేసినా.. రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించకుండా కేవలం 45 పోస్టులను భర్తీ చేసి, మిగిలిన ఐదు పోస్టులను ఎందుకు ఆపారని, ఒకవేళ ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఆక్షేపణల



(తరువాయి 8వ పేజీలో...)



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కూలీలకు పనులు కల్పించాలి : కలెక్టర్

తాడ్వాయి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రతీ గ్రామంలో ఉపాధి హామీ కూలీలకు పనులు కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. ఈయన శుక్రవారం తాడ్వాయి మండలం సంతాయిపేట గ్రామంలోని శ్రీభీమేశ్వరాలయం సమీపంలోని చెక్ డ్యాంలోని పూడికతీత పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి కాలంలో ఉపాధి హామీ పథకం కింద కూలీలకు పనులు కల్పించాలని అన్నారు. గ్రామంలో 240 హౌస్ హోల్డర్స్‌కి గాను 316 జాబ్ కార్డు ఉన్నాయనీ, 280 యాక్టివ్ కూలీలు పనులకు హాజరవుతున్నారని తెలిపారు. దాదాపు ఒక వారం నుంచి చేపడుతున్న పూడికతీత పనుల్లో కూలీలకు కూలి చెల్లించడం లేదని, పోస్టాఫీస్ ద్వారా చెల్లింపులు ఆలస్యం అవుతున్నాయని కూలీలు కలెక్టర్‌కు వివరించారు. పోస్టల్ శాఖ ద్వారా కాకుండా బ్యాంకు ఖాతాల ద్వారా కూలి చెల్లించే విధంగా ఏర్పాటు చేయాలని జిల్లా గ్రామీణాభి వృద్ధి అధికారికి సూచించారు. అనంతరం శ్రీ భీమేశ్వరాలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ దేవాలయం పురాతన కాలం నాటిదని, పర్యాటకంగా అభివృద్ధి పరచాలని పూజారులు, గ్రామస్థులు కలెక్టర్‌ను కోరారు. రోడ్డు సౌకర్యం, నీరు, టాయ్ లెట్స్ ఏర్పాటు చేయాలని కోరారు. వెంటనే కలెక్టర్ స్పందించి తక్షణమే పబ్లిక్ టాయిలెట్స్‌ను ఆలయం ఆవరణలో కట్టించాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం గ్రామంలోని నర్సరీని పరిశీలించి, ఇంటింటికీ పంపిణీ చేసే విధంగా పండ్లు, పూల మొక్కలను పెంచాలని తెలిపారు. అనంతరం పల్లె ప్రకృతి వనంలో కలెక్టర్ మొక్కలకు నీరు పోశారు. ప్రతీరోజు మొక్కలకు నీరు పోయాలని తెలిపారు. అనంతరం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో భాగంగా గ్రామస్థులు ప్రమీల ఇంటికి భూమిపూజ చేసి, నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ తెలిపారు. ఆ తరువాత బ్రహ్మాజీవాడ గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా మొక్కలకు వాటరింగ్ నిర్వహించారు. ఏవెన్యూ ప్లాంటేషన్ నిర్వహించాలని, గాప్‌లలో కొత్త మొక్కలు నాటాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రాజారాం, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, ఇన్‌చార్జి తహసీల్దార్ రేఖ, ఎంపీడీవో సాజిద్ అలీ ఎంపీవో సవితా రెడ్డి, ఏపీవో కృష్ణ గౌడ్, టెక్నికల్ అసిస్టెంట్ స్వామి, తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న డిప్టీ కమిషనర్ మంజునాథ్

మద్నూర్‌లో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు

● స్థల పరిశీల చేసిన డిప్టీ కమిషర్

మద్నూర్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మద్నూర్ మండలంలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు కోసం డిప్టీ కమిషనర్ మంజునాథ్ స్థల పరిశీలన చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయడానికి అనువైన స్థలాన్ని ఆయన తన సిబ్బందితో పరిశీలించారు. దాంతో పాటు తాత్కాలికంగా కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయడానికి గాను మండల కేంద్రంలోని కస్తూరిబా గురుకుల పాఠశాల, లేండి ప్రాజెక్టు పరిధిలో ఉన్న గదులను పరిశీలించారు. కేంద్రీయ విద్యాలయానికి అవసరమైన 11 గదులు ఉన్న స్థలాన్ని సూచించాలని అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని ఎల్లమ్మ గుట్ట పరిధిలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయడానికి గాను నాలుగున్నర ఎకరాల భూమి అణువుగా ఉందని గుర్తించారు. మద్నూర్ మండల కేంద్రంలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయడంతో తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు సైతం ఈ పాఠశాలలో చదువుకుని అవకాశం ఉంటుందని గుర్తు చేశారు. ఆయనతో పాటు కామారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, ఎంఈవో రాములు, తహసీల్దార్ ముజీబ్, తదితరులు ఉన్నారు.

రైతులు ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దు : పోచారం

బీర్కూర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రైతు సోదరులు తాము పండించిన వరి ధాన్యాన్ని దళారులకు విక్రయించుకుని మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి రైతులకు సూచించారు. శుక్రవారం ఆయన రాష్ట్ర ఆగ్రోస్ చైరన్ కాసుల బాల్‌రాజ్, సబ్ కలెక్టర్ కిరణ్మయిలతో కలిసి తిమ్మాపూర్, బీర్కూర్ గ్రామాలలో సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయకట్టు రైతులు సాగు నీటిని పొదుపుగా వాడుకోవడం వల్ల నిజాంసాగర్ ప్రాజెక్టులో ప్రస్తుతం వీటీఎంసీల జలాలు నిల్వ ఉన్నాయని అన్నారు. వచ్చే వర్షాకాలంలో రబీ సీజన్‌కు నారు మళ్లు వేసుకోడానికి గాను జూన్‌లో సాగర్ జలాలు విడుదల చేయిస్తామన్నారు. రాష్ట్రంలో వరి కోతల్లో బాన్సువాడ నియోజకవర్గం ముందు ఉందన్నారు. నియోజకవర్గంలో యాసంగి వరి కోతలు అన్ని జిల్లాలతో పోలిస్తే ముందస్తుగా ప్రారంభమయ్యాయన్నారు. అందుకు అనుగుణంగా అన్ని గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రోస్ చైర్మెన్ కాసుల బాల్‌రాజ్, సబ్ కలెక్టర్ కిరణ్మయి, తహసీల్దార్ లత, నాయకులు శ్యామల, శశి కాంత్, శ్రీనివాస్, రాములు, సత్యనారాయణ, సాయిరాం, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లపై ఒత్తిళ్లు తగవు

● సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా

బాన్సువాడ టౌన్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ టీచర్లపై అధికారుల ఒత్తిళ్లు తగవంటూ శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు బాన్సువాడ సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు ఖలీల్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఇంటి పని చేయకుంటే వరుసగా అంగన్‌వాడీ సెంటర్లను విజిట్ చేస్తూ మెమోలు జారీ చేయడం , వేధింపులకు గురిచేయడం జరుగుతోందని మండిపడ్డారు. ఇటీవల బొమ్మన్‌దేవ్‌పల్లికి చెందిన అంగన్‌వాడీ టీచర్‌ను సూపర్‌వైజర్ వేధింపులకు గురిచేయడంతో ఆమె ఆత్మహత్యకు పాల్పడిందని, ఇలాంటి అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, తదితరులున్నారు.

నేడు రామారెడ్డికి ఎమ్మెల్సీ కవిత

రామారెడ్డి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ కవిత శనివారం రామారెడ్డి మండల కేంద్రానికి రానున్నట్లు మాజీ ఎంపీపీ నారెడ్డి దశరత్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ప్రముఖ కాలభైరవ స్వామి ఆలయం వద్ద శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ కాలభైరవ ఆలయంలో ఎమ్మెల్సీ కవిత ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకోనున్నారని తెలిపారు. ఇందులో మాజీ జడ్పీటీసీ పడిగేల రాజేశ్వర్ రావు, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బుచ్చిరెడ్డి నాయక్, నాయకులు మోహన్ రెడ్డి, కాసర్ల రాజేందర్, తదితరులున్నారు.

'ధాన్యం కొనుగోలు కేంద్రాలు.. మహిళా సంఘాలకు వద్దు'

తాడ్వాయి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం మహిళా సంఘాలకు అప్పగించవద్దని తాడ్వాయి సొసైటీ చైర్మన్ నల్లవెల్లి కపిల్ రెడ్డి అన్నారు. ఈయన శుక్రవారం మండలంలోని సింగిల్ విండో కార్యాలయంలో మహా జనసభ నిర్వహించి మాట్లాడారు. అనంతరం మాట్లాడుతూ మహిళ సంఘాలకు కొనుగోలు సెంటర్లను అప్పజెప్పితే సొసైటీలు నష్టాల బాటలో నడుస్తాయని అన్నారు. అనంతరం రుణమాఫీని ఏకకాలంలో చేయాలని తీర్మానించారు. కొత్త సభ్యులకు సభ్యత్వ రుసుము చెల్లించి నమోదు చేసుకోవాలని తీర్మానించారు. అనంతరం సొసైటీ లావాదేవీలను సభ్యుల సమక్షంలో చదివి వినిపించారు. వచ్చే సంవత్సరం రైతులకు అందుబాటులో ఎరువులు ఉంచుతామని తెలిపారు. ఇందులో డైరెక్టర్లు రాజిరెడ్డి, మోహన్‌రెడ్డి, సంజీవరెడ్డి, సిబ్బంది నరసింహులు, బాలకిషన్, నితీష్ రెడ్డి, రమేష్, గ్రామ రైతులు, తదితరులు పాల్గొన్నారు.

● ప్రధాని ఫొటో పెట్టకపోవడంపై వాగ్వాదం

బీర్కూర్: మండల కేంద్రంలోని సహకార సంఘం ఆవరణలో ఇన్‌చార్జి విండో అధ్యక్షుడు రాధాకృష్ణ అధ్యక్షతన శుక్రవారం మహాజన సభ నిర్వచించారు. విండో కార్యదర్శి విఠల్ సంఘానికి సంబంధించిన లావాదేవీలను, ఆదాయ వ్యయాలను, జమా ఖర్చులను సభలో చదివి వినిపించారు. ఇదిలా ఉండగా కొన్ని ఖర్చుల విషయంలో సభ్యులు కార్యదర్శిని నిలదీశారు. మరోవైపు సహకార సంఘం కార్యాలయంలో ప్రధాని నరేంద్ర మోదీ ఫొటో పెట్టకపోవడంపై బీజేపీ నాయకులు సంఘం కార్యదర్శితో వాగ్వాదానికి దిగారు. సంఘానికి సంబంధించిన నిధులతో బరంగ్ ఏడ్గి గ్రామ శివారులో రూ.55 లక్షల వ్యయంతో ఎకరం భూమిని ఎందుకు కొనుగోలు చేశారని ప్రశ్నించారు. కాగా, సమాధానాలు చెప్పలేక సదరు కార్యదర్శి మిన్నకుండి పోయారు.

అగ్నిపథ్‌కు పలువురి ఎంపిక

పెద్దకొడప్‌గల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బేగంపూర్ గ్రామానికి చెందిన పెద్దోళ్ల అంజయ్య గత డిసెంబర్‌లో హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రవేశ పరీక్షలో అగ్నిపథ్‌కు ఎంపిక అయినట్లు గ్రామస్థులు తెలిపారు. గ్రామానికి చెందిన పెద్దోళ్ల సాయవ్వ- మల్లయ్య కుమారుడైన అంజయ్య ప్రాథమిక విద్యను బేగంపూర్, 6 నుంచి 10వ తరగతి వరకు పెద్ద కొడప్‌గల్ ఉన్నత పాఠశాల, ఇంటర్ బాన్సువాడ ఠాగూర్ కళాశాలలో పూర్తిచేశారు. గత సంవత్సరం డిసెంబరులో జిల్లాకు చెందిన వారికి గచ్చిబౌలిలో ప్రవేశ పరీక్ష నిర్వహించగా అంజయ్య ఈ పరీక్షలో ప్రతిభ కనబరిచి అగ్నిపథ్‌కు ఎంపికైనట్లు వివరించారు.

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కళాశాల విద్యార్థులుఅగ్నివీర్ ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అన్నపూర్ణ తెలిపారు. వారిలో కే.అనిల్, నాగరాజు, శివ, నరేష్, పవన్, అజయ్ అనే విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని పేర్కొన్నారు.

ఏప్రిల్ నుంచి ధాన్యం కొనుగోళ్లు

- కొనుగోళ్లకు పూర్తి ఏర్పాట్లు చేశాం
- జిల్లావ్యాప్తంగా 446 కొనుగోలు కేంద్రాలు
- ఈసారి మహిళా సంఘాలకు 183 కేంద్రాలను కేటాయించాం
- 5.63 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్ల లక్ష్యం
- ఉగాది నుంచి సన్నబియ్యం పంపిణీ
- 2,396 ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల ఎంపిక
- ఇందులో 1672 మందికి ఇండ్లు మంజూరు
- 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో జిల్లా అదనపు (రెవెన్యూ) కలెక్టర్ విక్టర్

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల కోసం.. ఏర్పాట్లు పూర్తి చేశామని, ఏప్రిల్ నుంచి కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామని జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) విక్టర్ తెలిపారు. జిల్లావ్యాప్తంగా 446 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నాం. ఈ సీజన్‌లో 183 మంది మహిళా సంఘాలకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను కేటాయించాం. 5.63 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్ల లక్ష్యంగా పెట్టుకున్నాం. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని కేంద్రాలకు తరలించాలన్నారు. ఈ ఉగాది నుంచి రేషన్‌షాపుల ద్వారా లబ్ధిదారులకు సన్నబియ్యాన్ని పంపిణీ చేయనున్నాం. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నాం. 2,396 ఇందిరమ్మ లబ్ధిదారులను అర్హులుగా గుర్తించాం. ఇందులో 1,672 మందికి ఇళ్లు మంజూరయ్యాయి. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో అదనపు కలెక్టర్ విక్టర్ పలు వివరాలను వెల్లడించారు.



మాట్లాడుతున్న విక్టర్, అదనపు కలెక్టర్, కామారెడ్డి

ఆంధ్రజ్యోతి: జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎప్పటి నుంచి ప్రారంభించనున్నారు?

అదనపు కలెక్టర్: జిల్లాలో ధాన్యం కొనుగోళ్లకోసం ఏర్పాట్లు పూర్తి చేశాం. ఇప్పటికే ఆయా శాఖల అధికారులతో పాటు రైస్‌మిల్లర్లతో సమావేశాలు నిర్వహించి కొనుగోళ్ల కోసం సమీక్షించడం జరిగింది. ఏప్రిల్ 1 నుంచి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నాం.

ఆంధ్రజ్యోతి: యాసంగి సీజన్‌లో మొత్తం ఎన్ని కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు?

అదనపు కలెక్టర్: కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ డివిజన్‌ల పరిధిలో ధాన్యం కొనుగోళ్ల కోసం 446 కేంద్రాలను ఏర్పాటు చేయనున్నాం. అయితే ఈ సీజన్‌లో మహిళా సంఘాలకు 183 కేంద్రాలను కేటాయించాం. ఇప్పటికే కొనుగోళ్ల కోసం మహిళా సంఘాలకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాం.

ఆంధ్రజ్యోతి: కొనుగోళ్ల లక్ష్యం ఎంత?

అదనపు కలెక్టర్: ఈ యాసంగి సీజన్‌లో ధాన్యం కొనుగోళ్ల లక్ష్యం 5,63,316 మెట్రిక్ టన్నులుగా పెట్టుకున్నాం. ఇందులో దొడ్డురకం ధాన్యం 4,49,347 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని సన్నరకం ధాన్యం 1,13,969 మెట్రిక్ టన్నుల కొనుగోలు చేయనున్నాం. దొడ్డు, సన్నరకం ధాన్యాన్ని వేరువేరుగాకొనుగోలు చేస్తాం.

ఆంధ్రజ్యోతి: మద్దతు ధర ఎంత?

అదనపు కలెక్టర్: రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలలో విక్రయిస్తే నాణ్యమైన ధాన్యాన్ని తీసుకురావాలి. ప్రభుత్వం నియమించిన మద్దతు ధరకే కొనుగోలు చేస్తాం. గ్రేడ్-ఏ క్వింటాల్‌కు రూ.2320, గ్రేడ్- బీ క్వింటాల్‌కు రూ.2300, తాళ్లు, పొల్లు, తేమ శాతం లేకుండా నాణ్యమైన ధాన్యాన్ని కేంద్రాలకు రైతులు తీసుకురావాలి.

ఆంధ్రజ్యోతి: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంతమందిని ఎంపిక చేశారు?

అదనపు కలెక్టర్: జిల్లాలోని 25 మండలాల పరిధిలో ఒక గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంచుకుని 25 గ్రామాలలో 2,396 మంది లబ్ధిదారులను ఎంపిక చేశాం. ఇందులో 1672 మందికి ఇండ్లను మంజూరు చేయడం జరిగింది. వీటి పరిధిలో 262 ఇళ్ల నిర్మాణానికి ముగ్గు పోయడంతో పాటు పలు ఇళ్లు పునాదుల స్థాయిలో నిర్మాణాలు చేపడుతున్నారు.

ఆంధ్రజ్యోతి: జిల్లావ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులు ఎన్ని వచ్చాయి?

అదనపు కలెక్టర్: రాష్ట్రప్రభుత్వం ఇటీవల నిర్వహించిన ప్రజాపాలన గ్రామ సభల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం జిల్లావ్యాప్తంగా 1,03,340 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 84వేలకు పైగా దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టడం జరిగింది. నాలుగు కేటగిరీలలో లబ్ధిదారులను విభజించి ఎంపిక చేపడుతున్నాం. ఇళ్ల నిర్మాణాలు వేగవంతం అయ్యేలా ఎప్పటికప్పుడు ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులతో సమీక్షలు నిర్వహిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: ఇందిరమ్మ ఇళ్లకు ఇసుకను ఉచితంగా ఇస్తున్నారా?

అదనపు కలెక్టర్: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇందిరమ్మ ఇండ్ల కోసం ఉచితంగా ఇసుకను సరాఫరా చేయనున్నాం. అంతేకాకుండా ఈ పథకం ద్వారా మంజూరై ఇళ్ల నిర్మాణం చేపట్టే లబ్ధిదారులు ఇసుక కోసం దరఖాస్తు పెట్టుకుంటే.. ఉచితంగా ఇసుకను సరాఫరా చేయనున్నాం. ఉచిత ఇసుకను సరాఫరా చేసేందుకు జిల్లాలో ఎక్కడెక్కడ ఇసుక నిల్వలు ఉన్నాయో ఆయా శాఖల ద్వారా సర్వే చేయిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం ఎప్పటి నుంచి పంపిణీ చేయనున్నారు?

అదనపు కలెక్టర్: ఉగాది పండుగ సందర్భంగా రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేసేందుకు పూర్తి ఏర్పాట్లు చేశాం. జిల్లాలో 578 రేషన్ దుకాణాలు ఉన్నాయి. వీటి పరిధిలో 2,53,293 రేషన్ కార్డులు ఉన్నాయి. వీటికి ప్రతీనెల 4,700 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సరాఫరా చేస్తున్నాం. ప్రస్తుతం 102 రేషన్ దుకాణాలకు 520 మెట్రిక్ టన్నుల సన్నబియ్యాన్ని సరాఫరా చేశాం. ప్రస్తుతం జిల్లాలో 24 వేల మెట్రిక్ టన్నుల సన్నబియ్యం స్టాక్ ఉంది. ఆరు నెలలకు సరిపడా సన్నబియ్యం నిల్వలు ఉన్నాయి.

- కామారెడ్డి, మార్చి 28(ఆంధ్రజ్యోతి)

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి

నాగిరెడ్డిపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఉగాది, రంజాన్ పండుగలు ఒకేసారి రావడంతో హిందూ, ముస్లింలు పండుగలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎల్లారెడ్డి సీఐ రవీందర్ నాయక్ కోరారు. శుక్రవారం నాగిరెడ్డిపేట పోలీస్ స్టేషన్‌లో హిందూ, ముస్లిం సోదరులతో శాంతి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగాది పర్వదినం సందర్భంగా మండలంలో నల్ల పోచమ్మ జాతర ఉత్సవాలు మూడు రోజుల పాటు ఘనంగా జరగనున్నాయని, ఇదే సమయంలో రంజాన్ పండుగ ఉన్నందున హిందువులు, ముస్లింలు తమ తమ పండుగలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని, పండుగ సందర్భంగా ఎలాంటి సంఘటనలు జరగకుండా చూడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎస్సై మల్లారెడ్డి, నల్ల పోచమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడు హనుమంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దోమకొండ: ఉగాది, రంజాన్ పండగలను ప్రశాంత వాతవారణంలో జరుపుకోవాలని ఎస్సై స్రవంతి అన్నారు. శుక్రవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో శాంతికమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రజలు పండగలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలన్నారు. ఎవరైనా ఇతరులకు ఇబ్బందులు కలిగే విధంగా ప్రవర్తించినా, పోలీసుల విధులకు అటాంకం కలిగించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.34
శనివారం సాయంత్రం

సహర్ : 4.50
(ఆదివారం ఉదయం)

మృదుత్వాన్ని, మెతక వైఖరిని అనుసరించే వారిగా ఎవరైతే ఉంటారో.. అల్లాహ్ వీరి కోసం నరకాన్ని నిషేధించాడు. కఠినత్వం, పిసినారితనం, ఓర్వలేని తనం, ద్వేషం, ఈర్ష్య లాంటి గుణాలున్న వాడికి నరకం తప్పదు.



పెర్కిట్ బైపాస్ రోడ్డులో పోలీసులకుసూచనలు చేస్తున్న సీపీ

వాహనదారులు హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించాలి

● సీపీ సాయిచైతన్య

ఆర్మూర్‌టౌన్ మార్చి28 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు హెల్మెట్, సీట్‌బెల్ట్ తప్పక ధరించాలని సీపీ సాయిచైతన్య వాహన దారులకు సూచించారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని 44వ జాతీయ రహదారిపై రోడ్డుప్రమాదాలు జరిగే ప్రాంతాలైన పెర్కిట్ బైపాస్ జంక్షన్, కరీంనగర్ అండర్ పాస్ రోడ్డును ఆయన పరిశీలించారు. ఈ ప్రాంతంలో జరిగే ప్రమాదాలను ఏలా తగ్గించాలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను పోలీస్ డిపార్ట్‌మెంట్, హైవే డిపార్ట్‌మెంట్ వారికి సూచనలు చేశారు. అనంతరం పట్టణం లోని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పలు రికార్డులను పరిశీలించి, పలు కేసులపై ఎస్‌హెచ్‌వో సత్యనారాయణతో చర్చించారు. ఆయన వెంట ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ నారాయణ, ఐరాడ్ ప్రాజెక్టు మేనేజర్ వర్ష, నేషనల్ హైవే సిబ్బంది రామారావు, విరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రుణమాఫీ వర్తింపజేయాలి

కోటగిరి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రుణమాఫీ ప్రతి రైతుకు వర్తింపజేయాలని సంఘ సభ్యులు డిమాండ్ చేశారు. రుద్రూరు విండో 90వ మహాజన సభ అధ్యక్షుడు సంజీవ రెడ్డి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. గత వార్షిక లావాదేవీలను సంఘ సభ్యులకు వివరించారు. రైతులకు రుణమాఫీ సక్రమంగా వర్తించకపోవడంపై పలువురు మండిపడ్డారు. రెండు లక్షల లోపు ప్రతి రైతుకు రుణమాఫీ వర్తింపజేయాలని కోరారు. ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి కొనుగోళ్లు చేయాలని రైతులు కోరారు. ఈ కార్యక్రమంలో విండో ఉపాధ్యక్షులు శంకర్, మాజీ జడ్పీటీసీ గంగారాం, డైరెక్టర్లు గోపి, అశోక్, గజేందర్ పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు బిల్లుపై నిరసన

వర్ని, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ బోర్డు ఆదేశం అనవసరమని వర్ని మండల కేంద్రంలో శుక్రవారం ముస్లింలు నిరసన తెలిపారు. వర్ని జామ మసీద్ వద్ద మోడీ సర్కార్ ప్రవేశ పెట్టనున్న వక్ఫ్‌బోర్డు బిల్లుకు వ్యతిరేకంగా నల్ల బ్యాడ్జిలతో నిరసన తెలిపారు. ముస్లిం, మైనారిటీ సోదరులు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రధాని మోడీ నిర్ణయాన్ని వ్యతిరేకించారు. తక్షణమే మోడీ సర్కార్ తన వైఖరి మార్చుకోకుంటే ఆందోళన తీవ్రం చేస్తామని హెచ్చరించారు.

నీటి ఎద్దడి నివారణ చర్యలు

వర్ని, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వర్ని మండలం చిలక తండాలో నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకున్నారు. బాన్సువాడ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు యలమంచిలి శ్రీనివాస్ రావు దృష్టికి గ్రామ ప్రజలు తీసుకువెళ్లగా వారు స్పందించారు. సొంత ఖర్చుతో బోరు వేయించి నీటి సమస్య తీర్చారు. అందుకు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బానోత్ శ్రీలత, సంతోష్, పండరి, వేణు, సాయిలు, సోమ్లా, గోవింద్, రమేష్, దేవ్‌సింగ్, తారే, రవి, హర్ష పాల్గొన్నారు.

రైతు భరోసా చెల్లించాలి

నవీపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పదెకరాలలోపు గల రైతులకు రైతు భరోసా చెల్లించాలని నాగేపూర్ సొసైటీ మహాజన సభలో తీర్మానించారు. శుక్రవారం సొసైటీ ఆవరణలో జరిగిన 63వ మహాజన సభలో పలు తీర్మానాలు ఆమోదించారు. అర్హులైన రైతులకు 2లక్షల రూపాయల వరకు రుణమాఫీ చేయాలని, యాసంగికి సంబంధించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని, ఎరువుల గోదాములకు మరమ్మత్తులు చేపట్టాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఛైర్మన్ శైలేష్ కుమార్, వైస్ ఛైర్మన్ సత్యం రెడ్డి, డైరెక్టర్లు శ్రీనివాస్ రావు, బేగరి సాయిలు, ధర్మాజీ, అంబర్ సింగ్, మనోజ్ కుమార్, నీలం సాయిలు, రవీందర్, కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి సౌండ్ సిస్టం, మైక్ సెట్ అందజేత

నవీపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాళేశ్వర్‌లోని వివేకానంద గ్రంథాలయానికి శుక్రవారం బినోల సొసైటీ ఛైర్మన్ హన్మాండ్లు సౌండ్ సిస్టంతో పాటు మైక్ సెట్‌ను అందజేశారు. సుమారు 7వేల రూపాయల విలువైన సౌండ్ సిస్టం, మైక్ సెట్‌ను గ్రంథాలయానికి అందించడం పట్ల యూత్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సొసైటీ ఛైర్మన్ హన్మాండ్లును యూత్ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ ఇన్‌చార్జి రొయ్యల శేఖర్, మహేష్, ఉదయ్, చరణ్, రాకేష్, రాజు, సంజయ్ తదితరులున్నారు.

పాఠశాలకు ..

జక్రాన్‌పల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పడకల్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న 1999-2000 బ్యాచ్ విద్యార్థులు తమవంతుగా శుక్రవారం పాఠశాలకు మైక్ సౌండ్ సిస్టంను అందజేశారు. సుమారు రూ.20 వేల విలువ గల సౌండ్‌సిస్టంను పాఠశాలకు వారు అందజేశారు.

కోటగిరి మాజీ ఎంపీపీకి పరామర్శ

కోటగిరి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కోటగిరి మాజీ ఎంపీపీ, మాజీ జడ్పీటీసీ సులోచనకు ఇటీవల సర్జరీ కావడంతో ఆమెను శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు, బాన్సువాడ మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ జుబేర్ పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు సంతోష్, నవీన్, గంగాప్రసాద్, శంకర్‌గౌడ్ ఉన్నారు.

దొడ్డు వడ్లకు బోనస్ ఇవ్వాలి

కోటగిరి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సన్నరకం వడ్లకు బోనస్ ఇచ్చినట్లే దొడ్డు రకం ధాన్యానికి బోనస్ ఇవ్వాలని బీజేపీ నాయకులు భజరంగ్ హన్మాండ్లు డిమాండ్ చేశారు. పొతంగల్ తహసీల్దార్ కార్యాలయంలో ఆర్‌ఐకి శుక్రవారం ఈ విషయమై వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన ఒక్క గింజ ధాన్యం బస్తా సైతం కొనుగోలు చేయలేదన్నారు. వడగండ్ల వాన కురిస్తే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ధాన్యానికి ఇప్పటికే కొనుగోలు కేంద్రాల వద్దకు తీసుకువస్తున్నారని ఆయన పేర్కొన్నారు. త్వరితగతిన ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు అశోక్, శంకర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మోస్రా పీహెచ్‌సీ తనిఖీ

మోస్రా, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మోస్రా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం డిప్యూటీ డీఎంహెచ్‌వో రాజు, అసిస్టెంట్ మైక్రో బయోలాజీ టాస్క్‌ఫోర్స్ వినయ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రంలో మొత్తం పలు రకాలైన మందులు, ప్రాథమిక చికిత్స ఆపరేషన్, 30రకాలైన మందులు ఉండాలని అవన్నీ పూర్తిస్థాయిలో ఉన్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు.

బోనస్ కుంభకోణంలో విజిలెన్స్ విచారణ జరిపించాలి

● కోటగిరి సీపీఐ నాయకుల ధర్నా, రాస్తారోకో



కోటగిరిలో రాస్తారోకో నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

కోటగిరి,మార్చి28(ఆంధ్రజ్యోతి): ధాన్యం బోనస్ కుంభకోణంలో విజిలెన్స్ విచారణ జరిపించాలని సీపీఐ మండల కార్యదర్శి విఠల్ గౌడ్ డిమాండ్ చేశారు. కోటగిరి మండల కేంద్రంలో సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం బోనస్ డబ్బులు స్వాహా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పెద్ద ఎత్తున రాస్తారోకో నిర్వహించారు. విండో ఛైర్మన్ కూచి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ పత్తి లక్ష్మణ్‌లకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు విఠల్ గౌడ్ మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టపడి వడ్లను పండిస్తే అకాల వర్షాలు రైతుల పాలిట శాపంగా మారుతున్నాయన్నారు. దిక్కుతోచక రైతులు దళారులకు ధాన్యం అమ్ముకుని తీవ్రంగా నష్టపోయ్యారన్నారు. అలాంటి రైతులకు లాభం చేయకుండా తమ అనుచరులకు మాత్రమే లబ్ది చేకూరేలా బోనస్ స్వాహా చేసిన విండో అధ్యక్షులు కూచి శ్రీనివాస్‌పై తగిన చర్యలు చేపట్టాలన్నారు. తన బంధువులు, అనుచరులను బినామీ రైతులుగా మార్చి బోనస్ కుంభకోణానికి పాల్పడడం సిగ్గు చేటన్నారు. ప్రజలకు మంచి చేస్తామని చెప్పి ప్రజాప్రతినిధులుగా గెలిపిస్తే విండో అధ్యక్షులు శ్రీనివాస్, కోటగిరి మాజీ సర్పంచ్ పత్తి లక్ష్మణ్ రైతుల నోట్లో మట్టి కొట్టడంతో పాటు ప్రభుత్వ ఖజానాకు గండికొట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. మాజీ మంత్రి పోచారం శ్రీనివాస్ రెడ్డి అండ చూసుకుని ఈ ఇద్దరు నాయకులు అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. బోనస్ కుంభకోణానికి పాల్పడిన నాయకులతో పాటు బోగస్ రైతుల నుంచి నిధులను రికవరీ చేసి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సహకార సంఘం ఛైర్మన్, రైస్‌మిల్లర్లు కుమ్మక్కై పెద్ద మొత్తంలో కుంభకోణానికి పాల్పడి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలుపై విజిలెన్స్ విచారణ జరిపించి అవినీతి, అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు గంగాధర్, హన్మాండ్లు, వీరేశం, రైతులు సాయిలు, గంగాధర్, రాములు, లక్ష్మణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ పండుగను ఘనంగా జరుపుకోవాలి

● వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి



కోటగిరి ఇఫ్తార్ విందులో ప్రార్థనలు చేస్తున్న పోచారం

కోటగిరి,మార్చి28(ఆంధ్రజ్యోతి): ముస్లిం సోదరులు రంజాన్ పండుగను ఘనంగా జరుపుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి సూచించారు. కోటగిరి మండల కేంద్రంలో ప్రభుత్వం తరపున శుక్రవారం ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థనలు చేసిన అనంతరం ఉపవాస దీక్షలను విరమింపజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ పండుగ ఎంతో పవిత్రమైందని ఆయన పేర్కొన్నారు. ముస్లింసోదరులు రంజాన్ పండుగను ఆనందోత్సాహల మధ్య జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ముందు మండలంలోని శ్రీనివాస్ రెడ్డి కాలనీ, అడ్కాస్‌పల్లి గ్రామాలలో పోచారం పర్యటించారు. శ్రీనివాస్ రెడ్డి కాలనీలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. అడ్కాస్‌పల్లి గ్రామంలో స్థలాన్ని పరిశీలించడంతోపాటు ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గులు వేశారు. అడ్కాస్‌పల్లి గ్రామంలో 16ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని ఆయన తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లను అర్హులైన వారికి అందజేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ శంకర్ పటేల్, నాయకులు శ్రీధర్, కృష్ణా రెడ్డి, మనోహర్, ఏజాజ్ ఖాన్, జుబేర్, బాబుఖాన్ పాల్గొన్నారు.

● రుద్రూరు మండల కేంద్రంలో శుక్రవారం ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఇఫ్తార్ విందుకు రాష్ట్ర ఆగ్రోస్ ఛైర్మన్ కాసుల బాల్‌రాజ్ హజరై ప్రత్యేక ప్రార్థనలు జరిపి ఉపవాస దీక్షలు విరమింపజేశారు. ముస్లింసోదరులు రంజాన్ పండుగను ఘనంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నారోజి గంగారాం, సంజీవ్ రెడ్డి, తోట శంకర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో ఫొటోల వివాదం

● మహిళల ఫొటోలు తీస్తున్న సెక్యూరిటీ గార్డులు

● సస్పెండ్ చేసిన సూపరింటెండెంట్



ఆసుపత్రిలో ఆందోళన చేస్తున్న మహిళలు

బోధన్‌రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చే రోగుల పట్ల మానవతా దృక్పథంతో సేవలు అందించాల్సిన సెక్యూరిటీ సిబ్బంది అర్ధరాత్రి ఫొటోలు తీయడం వివాదస్పదంగా మారింది. వైద్యం కోసం వచ్చిన వారి బంధువులు నిద్రమత్తులో ఉండగా ఫొటోలు తీయడం వివాదస్పదంగా మారింది. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. బోధన్ ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం అర్ధరాత్రి నయీం అనే సెక్యూరిటీ గార్డు రాత్రి ఒంటి గంట సమయంలో రోగి వెంట పడుకున్న బంధువుల ఫోటోలను తీయడం వివాదస్పదంగా మారింది. రోగి బంధువులు మేల్కొని ఇంత రాత్రిపూట ఫోటోలు ఎందుకు తీస్తున్నావని ప్రశ్నించగా పొంతన లేని సమాధానం ఇవ్వడంతో ఉదయం ఆందోళన నిర్వహించి ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందించారు. జలాల్‌పూర్‌తో పాటు పలు గ్రామాల రోగులు గురువారం అర్ధరాత్రి చికిత్స పొందుతున్న రోగులతో పాటు జనరల్ వార్డులో పడుకున్నారని తెలిపారు. ఒంటి గంట ప్రాంతంలో సెక్యూరిటీ గార్డు మహిళల ఫోటోలు తీయడం కొందరు మహిళలు చూశారన్నారు. ఫోటోలు తీయడం ఎందుకని ప్రశ్నించడంతో వివాదస్పదంగా మారింది. బోధన్ ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ రాహుల్ వద్దకు ఫిర్యాదు చేయగా విచారించిన సూపరిండెంట్ సెక్యూరిటీ గార్డు నయీమ్‌ను విధుల నుంచి తొలగిస్తున్నట్లు కాంట్రాక్టర్‌కు తెలియజేశారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ రోగులు, సంబంధిత బంధువుల పట్ల అర్ధరాత్రి ఫొటోలు తీయడం సరికాదన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులను సెక్యూరిటీ సిబ్బంది మానవతా దృక్పథంతో చూడాలని, ఇలాంటి తప్పిదాలుచేస్తే ఊరుకునేది లేదన్నారు.

క్షత్రీయ సమాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఖాందేశ్ సంగీతకు సన్మానం

ఆర్మూర్‌రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మున్సిపల్ పరిధి పెర్కిట్‌లోని ఎంఆర్ గార్డెన్‌లో శుక్రవారం మామిడిపల్లి క్షత్రీయ సమాజ్ మహిళ మండలి ఆధ్వర్యంలో క్షత్రీయ ప్రాంతీయ సమాజ్ మహిళ మండలి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఖాందేశ్ సంగీతను ఘనంగా సన్మానించారు. ఇటీవల క్షత్రీయ సమాజ్ రాష్ట్ర మహిళ ఉపాధ్యక్షురాలిగా ఎన్నిక కావడంతో ఖాందేశ్ సంగీతను సన్మానించారు. ఈ సందర్భంగా ఖాందేశ్ సంగీత మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించడం అభినందనీయ మన్నారు. మహిళల్లో కష్టపడే తత్వం, జవాబుదారి తనం ఉంటుందని, ప్రముఖ కంపెనీలు మహిళలకే సీఈవో బాధ్యతలు అప్పగిస్తున్నారంటే ఉద్యోగం పట్ల మహిళలకు ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో క్షత్రీయ సమాజ్ అధ్యక్షుడు ఖాందేశ్ సుదర్శన్, కార్యదర్శి అల్జాపూర్ నందకిశోర్, కోశాధికారి రాందాస్, యూత్ అధ్యక్షుడు వేణు, కిరణ్, సుజాత, కవిత, వాణి, ఇంద్ర, గౌతమి, సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

ఒకే దేశం, ఒకే ఎన్నికతో దేశం అభివృద్ధి

కోటగిరి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఒకేసారి దేశం మొత్తం ఎన్నికలు జరిగితే దేశం మరింత అభివృద్ధి సాధిస్తుందని రుద్రూరు మండల బీజేపీ నాయకులు హరికృష్ణ పేర్కొన్నారు. రుద్రూరు మండల కేంద్రంలో బీజేపీ కార్యాలయంలో శుక్రవారం ఒకే దేశం ఒకే ఎన్నికపై కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకే దేశం ఒకే ఎన్నికపై ప్రజలకు అవగాహన కల్పించే బాధ్యత బీజేపీ కార్యకర్తలపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ప్రశాంత్ గౌడ్, గణేష్, గజేందర్, శివప్రసాద్, విజయ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌లో పర్యటించిన మాజీ ఎమ్మెల్యే సతీమణి

బోధన్‌రూరల్,మార్చి28(ఆంధ్రజ్యోతి): బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ సతీమణి అయేషా పాతిమా శుక్రవారం బోధన్‌లో పర్యటించారు. రంజాన్ పండుగ సందర్భంగా ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఓ ప్రైవేటు ఆసుపత్రి ప్రారంభించి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మొబిన్ హైమద్, డాక్టర్ షరీర్‌లతో బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య

నవీపేట,మార్చి28(ఆంధ్రజ్యోతి): మండలంలోని నందిగామకు చెందిన కర్రోల్ల పోశెట్టి(43) అనే వ్యక్తి స్థానిక చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్‌ఐ వినయ్ తెలిపారు. మద్యానికి బానిసైన పోశెట్టి ఇటీవల వచ్చిన రైతు భరోసా డబ్బులను సైతం ఖర్చు చేశాడని అన్నారు. ఈ విషయమై భార్య రోజా తన భర్తను నిలదీయడంతో ఈ నెల 26న బయటకు వెళ్లిన ఆయన తిరిగి ఇంటికి చేరుకలేదని అన్నారు. శుక్రవారం స్థానిక కొత్తకుంట చెరువులో పోశెట్టి మృతదేహం లభ్యమైందని ఎస్‌ఐ పేర్కొన్నారు. మృతుడికి భార్య రోజా, ఓ కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారని, భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆటోను ఢీకొన్న టిప్పర్.. ఇద్దరికి తీవ్ర గాయాలు

నవీపేట,మార్చి28(ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ మండలం పాల్దా సమీపంలో గురువారం ఉదయం ఆటోను టిప్పర్ ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయని ఎస్‌ఐ వినయ్ తెలిపారు. నిజామాబాద్‌లోని నిజాంకాలనీకి చెందిన మిర్జా మహ్మద్ సలీం బేగ్, గౌతంనగర్‌కు చెందిన మహ్మద్ అస్లాం, ఎల్లమ్మ గుట్టకు చెందిన మహ్మద్ అన్వర్‌లు ఆటోలో నిజామాబాద్ నుండి మాక్లూర్ మండలం మాదాపూర్‌కు వెళ్తుండగా పాల్దా సమీపంలో ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీకొందని అన్నారు. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న మిర్జా మహ్మద్ సలీం బేగ్, మహ్మద్ అస్లాంలకు తీవ్ర గాయాలు కావడంతో వారిని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా స్వల్ప గాయాలైన మహ్మద్ అన్వర్‌ను జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అందించడం జరిగిందని అన్నారు. శుక్రవారం బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు టిప్పర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

8 మంది పేకాటరాయుళ్ల పట్టివేత

బోధన్‌రూరల్,మార్చి28(ఆంధ్రజ్యోతి): సాలూర మండల కేంద్రంలోని రహస్య స్థావరంలో పేకాట ఆడుతున్న 8మందిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి ఒక్కొక్కరికి ఐదువేల రూపాయల జరిమానతో పాటు ఒకరోజు సాధారణ జైలుశిక్ష విధించడం జరిగిందని బోధన్ రూరల్ ఎస్‌ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన వ్యక్తిని కోర్టులో హాజరుపర్చగా రెండు రోజుల జైలుశిక్ష విధించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు పేకాట ఆడవద్దని, అధికంగా మద్యం సేవించి వాహనాలు నడపవద్దని పేర్కొన్నారు.

వర్నిలో రూ.500 నకిలీ నోట్లు

వర్ని, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వర్ని మండలంలో రూ.500 నకిలీ నోట్లు కలకలం రేపుతున్నాయి. మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి ఉమ్మడి వర్ని మండలంలో ఈ నకిలీ నోట్లను యథేచ్ఛగా చెలామణి చేస్తున్నాడు. తన వ్యవసాయ కూలీ పనులకు వచ్చే కూలీలకు కూలీ కింద రూ.500నోట్లను అందజేస్తున్నారు. గురువారం రాత్రి ఓ పేకాట స్థావరం వద్ద ఒకే వ్యక్తి వద్ద 11నోట్లు 500చొప్పున లభ్యం కావడం చర్చనీయాంశంగా మారింది. ఈ 500నోట్లపై ఆరా తీస్తే వర్నికి చెందిన వ్యక్తి తమకు ఇచ్చినట్లు తెలిపారు. సదరు వ్యక్తి లక్షల రూపాయలు నకిలీ నోట్లు చలామణి చేస్తూ అమాయకులను బురిడి కొట్టిస్తున్నట్లు తెలుస్తోంది. పోలీసులు ఇలాంటి వారిపై అప్రమత్తంగా ఉంటూ నకిలీ నోట్ల బాగోతం బయట పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

బషీరాబాద్‌లో చలివేంద్రం ఏర్పాటు

కమ్మర్‌పల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బషీరాబాద్ గ్రామంలో ప్రభుత్వ అదేశాలమెరకు స్థానిక బస్టాంవద్ద గ్రామ పంచాయితీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని పంచాయితీ కార్యదర్శి శ్రీనివాస్ శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు శ్రీరాముల మురళి, వీడీసీ అధ్యక్షుడు డబ్బుగల ఆనంద్, ఉపాధ్యక్షుడు పోలీసు రాము లు, తోట అప్పయ్య, పార్వతి రాజు, సత్యానంద్ సిసిలు సీఏలు అంగన్ వాడి టీచర్లు, గ్రామ సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

సహకార సంఘంలో కుంభకోణాలకు బాధ్యులెవరు?

● సభలో అధికారులను నిలదీసిన సభ్యులు



ఎత్తొండ సొసైటీలో అధికారులను నిలదీస్తున్న దృశ్యం

కోటగిరి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘంలో రెండు పాలకవర్గాల తప్పిదాలతో పెద్ద ఎత్తున కుంభకోణాలు జరిగాయని ఈ కుంభకోణాలకు బాధ్యత ఎవరు వహిస్తారని సంఘ సభ్యులు అధికారులను నిలదీశారు. కోటగిరి మండలంలోని ఎత్తొండ సహకార సంఘం 82వ మహజన సభ విండో అధ్యక్షులు రాందాస్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘంలో జరిగిన లావాదేవీలను సభ్యులకు వివరించారు. సహకార సంఘంలో సుమారు 10కోట్లకు పైగా నష్టం జరిగినట్లు అధికారులు గుర్తించారని ఆ నిధులను త్వరితగతిన గత పాలకవర్గ సభ్యుల నుంచి రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. హెచ్‌ఎంటీ బియ్యం బిల్లు 6.33లక్షల రూపాయలు రికవరీ చేయడంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని సభ్యులు నిలదీశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సంఘం నష్టాల్లో ఉన్నందున సిబ్బంది వేతనాల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఆఫీసర్ అంబర్ సింగ్ రాథోడ్, విండో కార్యదర్శి రాజశేఖర్, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన అన్వేష్‌రెడ్డి



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ అన్వేష్‌రెడ్డి

వేల్పూర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డిని అసెంబ్లీ లోని వారి కార్యాలయంలో శుక్రవారం రాష్ట్ర విత్తనాబి వృద్ధి సంస్థ ఛైర్మన్ అన్వేష్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. విత్తనాబి వృద్ధి సంస్థకు నిధులు ఇవ్వాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులకు అవస్థలపై స్పందించిన కమిషనర్



ప్రింటర్‌లు, సిస్టమ్‌లు ఏర్పాటు చేస్తున్న కమిషనర్

ఆర్మూర్‌టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలోని టౌన్‌ప్లానింగ్ సెక్షన్‌లో ఏర్పాటు చేసిన ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారుల అవస్థలపై గురువారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో కథనం ప్రచురితం కావడంతో మున్సిపల్ కమిషనర్ రాజు స్పందించారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలోని మిటింగ్ హాల్‌లో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులు అవస్థలు పడకుండా మూడు ప్రింటర్‌లను, ఐదు సిస్టంలను ఏర్పాటు చేశారు. దీంతో దరఖాస్తుదారులకు కూర్చోవడానికి కూర్చిలు ఉండడంతో హర్షం వ్యక్తం చేశారు.

రూ.30లక్షలు పలికిన తైబజార్ వేలం పాట

ఆర్మూర్‌టౌన్, మార్చి28 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని పట్టణంతో పాటు మామిడిపల్లి, పెర్కిట్, కొటార్మూర్‌లకు సంబంధించి తైబజార్ వేలం పాట రూ.30లక్షలు పలికింది. శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో తైబజార్ వేలం పాట నిర్వహించగా ముగ్గురు కాంట్రాక్టర్‌లు పాల్గొని మహమ్మద్‌షఫీ అనే వ్యక్తి సంవత్సరానికి సంబంధించిన తైబజార్ వేలాన్ని దక్కించుకున్నారు.

రెంజర్ల సొసైటీలో మహాజన సభ

ముప్కాల్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ముప్కాల్ మండలంలోని రెంజర్ల సొసైటీ కార్యాలయంలో శుక్రవారం సొసైటీ ఛైర్మన్ కోమటిశెట్టి గంగాధర్ అధ్యక్షతన మహాజన సభ నిర్వహించారు. ఇట్టి సభకు డైరెక్టర్‌లు ఖాతాదారులు పాల్గొనగా సొసైటీ కార్యదర్శి గంగాధర్ ఆధాయ వ్యయా లను చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్‌ఛైర్మన్ ముస్కు సంతోష్‌రెడ్డి, డైరెక్టర్‌లు ఆకుల రమేష్, క్యాతం గంగారెడ్డి, దాసరి నర్సయ్య, ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

అంకాపూర్ అభివృద్ధి పనులకు రూ.60లక్షల మంజూరు

ఆర్మూర్‌రూరల్, మార్చి28 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలో అభివృద్ధి పనులకు ప్రభుత్వం రూ.60 లక్షలు మంజూరు చేసినట్టు మార్కెట్ కమిటీ డైరెక్టర్ అమృత్‌రావు తెలిపారు. ఐదు కుల సంఘాల భవనాలకు ఎస్‌డీఎఫ్ నిధులు రూ.20లక్షలు, సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి సీఆర్‌ఆర్ నిధులు రూ.30లక్షలు, సీసీరోడ్డు నిర్మాణానికి ఎన్ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.10లక్షలు మంజూరయ్యాయన్నారు. నిధులు మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి, నిధుల మంజూరుకు కృషి చేసిన ఆర్మూర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ వినయ్‌రెడ్డి, మాజీ గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మార చంద్రమోహన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు వైద్య శిబిరం

ఆర్మూర్‌టౌన్, మార్చి28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్మైల్ ది స్కూల్‌లో శుక్రవారం విద్యార్థులకు వైద్య శిబిరం నిర్వహించినట్టు కళాశాల ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ షబానగౌహార్ తెలిపారు. ఈ సందర్భంగా పిల్లల నిపుణులు డాక్టర్ కె.కాంతికుమార్, డెంటిస్ట్ డాక్టర్ బిందు విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఓమోగ్లోబిన్ టెస్టులను చేయించి రిపోర్టులు అందజేశారు. దీంతో పలువురు విద్యార్థులకు మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సింధుర, ప్రసన్న, సవిత పాల్గొన్నారు.

అపార్ ఐడీని వందశాతం పూర్తి చేయాలి

బోధన్‌రూరల్,మార్చి28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థుల అపార్ ఐడీని ఈ నెలాఖరు కల్లా వందశాతం పూర్తి చేయాలని బోధన్ మండల విద్యాశాఖ అధికారి నాగయ్య అన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బోధన్ అర్బన్, రూరల్ మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదివే విద్యార్థుల అపార్ ఐడీని వందశాతం పూర్తి చేయాలని, ఫార్మెటివ్ అసిస్‌మెంట్ 1, 2, 3, 4గ్రేడింగ్‌లను సమ్మేటివ్ అసిస్‌మెంట్ టెస్ట్ 1 గ్రేడింగ్‌లను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని పేర్కొన్నారు.

డొంకేశ్వర్ వారసంత వేలం

డొంకేశ్వర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో వారసంతకు శుక్రవారం వేలం పాట నిర్వహించారు. స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన వేలం పాటలో ఆరుగురు వేలం పాటలో పాల్గొనగా డొంకేశ్వర్ మండల కేంద్రానికి చెందిన నారాగౌడ్ సంతకు రూ.ఒక లక్ష 11వేల వేలం పాట ద్వారా దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో లక్ష్మీప్రసాద్, కార్యదర్శి శేఖర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న అధికారులు

మోర్తాడ్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన ఇఫ్తార్ విందులో పలువురు అధికారులు పాల్గొన్నారు. స్థానిక మాజిద్ ఆధ్వర్యంలో ఇఫ్తార్‌విందును ఏర్పాటు చేశారు. సాయంత్రం ఇఫ్తార్‌విందులో ఎస్సై బి.విక్రం, ఎంపీడీవో తిరుమల, ఎంపీపీ సూపరిండెంట్ పద్మనందం, కాంగ్రెస్ నాయకులు నసీర్, ఎఎంసీ డైరెక్టర్ నవీద్, పంచాయతీకార్యదర్శి సైఫోద్దిన్, గురువయ్య పాల్గొన్నారు.


రైతులకు అందుబాటులో యూరియా, ఎరువులు

వేల్పూర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పచ్చలనడ్కుడ వ్యవసాయ సహకార సంఘంలో రైతులకు ఫర్టిలైజర్ యూరియా, కాంప్లెక్స్ ఎరువులు ఎల్లప్పుడు సిద్ధంగా ఉంచడం జరుగుతుందని సొసైటీ ఛైర్మన్ లింబారెడ్డి తెలిపారు. శుక్రవారం పచ్చలనడ్కుడ సొసైటీ మహాజన సభ సొసైటీ ఛైర్మన్ లింబారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా లింబారెడ్డి మాట్లాడుతూ సొసైటీలో కొత్త క్రాప్‌లోన్స్ రూ.70లక్షల వరకు ఇవ్వడం జరిగిందన్నారు. ఎరువులు, ఫర్టిలైజర్ రైతులకు అందుబాటు ఉంచుతూ రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వేల్పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌ఛైర్మన్ గడ్డం నర్సారెడ్డి, సొసైటీ సెక్రెటరీ స్వామి, డైరెక్టర్‌లు గట్టపుతాల నర్సారెడ్డి, తలారి శేఖర్, అంకం నాగమల్లేష్, కొమ్ముల రాజన్న పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి

రెంజల్,మార్చి28(ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్ అన్నారు. శుక్రవారం మండలంలోని సాటాపూర్ గ్రామంలోని రైతు వేదికలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని మార్చాలన్న కుట్రను తిప్పి కొట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అంబేద్కర్ ముందు చూపుతోనే రాజ్యాంగాన్ని రచించారని, రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

ఫోకస్



రైస్‌మిల్లు నుంచి వెలువడుతున్న దుమ్ము, ధూళి

కాలుష్యపు కోరల్లో ఎల్లారెడ్డి

- ఎల్లారెడ్డి పట్టణ నడి ఒడ్డున ఉన్న రైస్ మిల్లులతో తంటాలు
- వడ్లపొట్టుతో శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్న ప్రజలు
- రైస్‌మిల్లులను పట్టణ శివారులకు తరలించాలంటున్న ప్రజలు

ఎల్లారెడ్డి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఒక వైపు వడ్లపొట్టు.. మరోవైపు కాలుష్యంతో ఎల్లారెడ్డి పట్టణ ప్రజలు సతమతమవుతున్నారు. ప్రధాన రహదారి వెంట రైస్ మిల్లులు ఉండటంతో ప్రజలు అటు వైపు నుంచి ప్రయాణించాలంటేనే జంకే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. వడ్లు పట్టిన తర్వాత మిగిలిన పొట్టుతో పొట్టు కాలుష్యంతో శ్వాసకోశ ఇబ్బందులు పడుతూ ప్రజలు అల్లాడుతున్నారు. రైస్‌మిల్లుల నుంచి వెలువడుతున్న దుమ్ము, ధూళితో చర్మ వ్యాధులు రావడంతో ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సి వస్తుందని వాపోతున్నారు. రైస్ మిల్లులను పట్టణ నడిబొడ్డు నుంచి తరలించి శివారు ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తే తమ ఇబ్బందులు తొలగిపోతాయని ప్రజలు పేర్కొంటున్నారు.

పట్టణమంతా బూడిదమయం

ఎల్లారెడ్డి మండలంలో దాదాపు 14 రైస్ మిల్లులు ఉండగా అందులో 12 పట్టణ కేంద్రాల్లోనే ఉన్నాయి. ఎల్లారెడ్డి నుంచి మెదక్ వెళ్లే రోడ్డు అనుకొని అదే విధంగా ఎల్లారెడ్డి నుంచి కామారెడ్డి వెళ్లే ప్రధాన రహదారుల పక్కన రైస్‌మిల్లులు ఉండటంతో నిత్యం రోడ్ల గుండా ప్రయాణించే వారికి రైస్ మిల్లుల నుంచి వెలువడే దుమ్ము కాలుష్యంతో నానా తంటాలు పడాల్సివస్తోంది. వడ్లపొట్టు కళ్లమంటతో పాటు ప్రమాదాలు సైతం చోటుచేసుకుంటున్నాయి. రైస్‌మిల్లుల నుంచి వెలువడే బూడిదమయంగా మారుతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈసమస్యలపై ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదనవ్యక్తం చేస్తున్నారు.

పట్టణ శివారులకు తరలించాలి

పట్టణ కేంద్రంలో ఉన్న రైస్ మిల్లులు వాటి సామర్థ్యాన్ని పెంచాయి. కానీ పెంపునకు అనుగుణంగా తగు జాగ్రత్తలు పాటించాల్సిన యజమానులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు రైస్ మిల్లులు నడిపితే విపరీతమైన దుమ్ము, ధూళి రోడ్లపైకి నివాసపు ఇళ్లపైకి వస్తోంది. పట్టణ కేంద్రంలోని పదుల సంఖ్యలో రైస్ మిల్లులు ఉండటంతో ప్రజలు అవస్థలు పడుతున్నామని, రైస్‌మిల్లులను శివారు ప్రాంతాలోకి తరలించేలా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.



ఎల్లారెడ్డి, కామారెడ్డి ప్రధాన రహదారి పక్కన రైస్‌మిల్లు వద్ద ఉన్న పొట్టు



ఆలయ ఆవరణలో గల అష్టముఖి కోనేరు

అష్టముఖి కోనేరు వద్ద ఏర్పాట్లు పూర్తి

ఎడపల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): శనివారం అమావాస్య సందర్భంగా ఎడపల్లి మండలంలోని జానకంపేట గ్రామశివారులో గల శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయ ఆవరణలో గల అష్టముఖి కోనేరు వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈఓ వేణు తెలిపారు. శనివారం అమా వాస్యను పురస్కరించుకుని భక్తులు అధికసంఖ్యలో ఆలయానికి వచ్చి అష్టముఖి కోనేరులో స్నానమాచరించి, ఆలయంలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీ నర్సింహ స్వామిని దర్శించుకుంటారు. ఆలయానికి జిల్లా నలుమూలల నుంచే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా భక్తులు ఆలయానికి వచ్చి అష్టముఖి కోనేరులో స్నానమాచరిస్తారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ ఈఓ తెలిపారు.

ఆంధ్రజ్యోతి పరిశీలన



ఆసరా కోసం ఎదురుచూపులు!

- ఉగాది, రంజాన్ పండుగలకు డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్న వృద్ధులు, దివ్యాంగులు
- సకాలంలో అందని ఆసరా పెన్షన్లు
- పెన్షన్ల కోసం తప్పని నిరీక్షణ

నాగిరెడ్డిపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పండుగలైన ఉగాది, రంజాన్ పండుగలకు ఆసరా, వితంతు, దివ్యాంగులు, ఒంటరి మహిళ, తదితర పింఛన్ల డబ్బులు అందకపోవడంతో పెన్షన్ లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కామారెడ్డి జిల్లావ్యాప్తంగా పింఛన్ డబ్బులు అందకపోవడంతో పింఛన్ లబ్ధిదారులు ఇబ్బందులు గురవుతున్నారు. గత కొన్నినెలలుగా ఆసరా పింఛన్ల పంపిణీలో తీవ్ర జాప్యం నెలకొంటుంది. ప్రతీనెల మొదటి వారంలో రావాల్సిన ఆసరా పెన్షన్లు నెల చివరికైనా రావడం లేదు. పింఛన్ల డబ్బుల కోసం పండుటాకులకు ఇబ్బందులు తప్పడం లేదు.

30న ఉగాది, 31న రంజాన్

హిందువుల ప్రముఖ పండుగ అయిన ఉగాది పండగ ఈనెల 30న ఉండగా, ముస్లింల ప్రముఖ పండుగ అయిన రంజాన్ పండుగ ఈనెల 31న ఉంది. హిందూ, ముస్లింల రెండు ప్రముఖ పండుగలు ఒక దినం తేడాతో ఒకేసారి రావడంతో ఇటు హిందూవులు, అటు ముస్లింలు తమ తమ పండుగలను ఘనంగా జరుపుకోనున్నారు. అయితే ప్రభుత్వం పండుగ వేళ ఆసరా, వితంతు, దివ్యాంగులు, ఒంటరి మహిళ తదితర పింఛన్ల డబ్బులను ఇప్పటివరకు మంజూరు చేయకపోవడంతో వృద్ధులు, దివ్యాంగులు, పెన్షన్‌దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పండుగవేళ పండుగ చేసుకునేందుకు చేతిలో చిల్లిగవ్వలేక పెన్షన్‌దారులు తీవ్రనిరాశకు లోనవుతున్నారు. ప్రభుత్వం సకాలంలో పెన్షన్‌దారుల డబ్బులు మంజూరు చేయకపోవడంతో సమయానికి పింఛన్లు అందక వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బందులు పడుతున్నారు.

జిల్లాలో లక్షా 47వేల పెన్షన్‌దారులు

జిల్లావ్యాప్తంగా మొత్తం ఒక లక్షా 47 వేల వరకు ఆసరా, వితంతు, వికలాంగుల, ఒంటరి మహిళ తదితర పెన్షన్లు ఉన్నట్లు తెలుస్తోంది. ఇందుకుగాను ప్రభుత్వం సుమారు రూ.31.49 కోట్లను కేటాయిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం డబ్బులను సకాలంలో కేటాయించకపోవడంతో ఆసరా పెన్షన్ల డబ్బులు లబ్ధిదారులకు సమయానికి అందడంలేదు. గత ఫిబ్రవరిలో కూడా ఫిబ్రవరి మాసం చివరివరకు ఆసరా పెన్షన్‌దారులకు డబ్బులు పంపిణీ జరగలేదు. మార్చి నెల ప్రారంభమయ్యాక మార్చి 3న ప్రభుత్వం పోస్టాఫీస్ ఖాతాల్లో డబ్బులను జమచేయడంతో పోస్టల్ అధికారులు 4వ తేదీ నుంచి పింఛన్‌దారులకు పెన్షన్ డబ్బులను పంపిణీ చేశారు. ప్రస్తుతం మార్చి నెల రెండురోజుల్లో ముగుస్తుండగా, ప్రభుత్వం ఇంతవరకు ఆసరా పెన్షన్ డబ్బులను మంజూరు చేయలేదు. దీంతో లబ్ధిదారులకు ఇప్పటికీ పెన్షన్ల డబ్బుల పంపిణీ ప్రక్రియ ప్రారంభం కాలేదు. ఉగాది, రంజాన్ పండుగల వేళ ఆసరా పింఛన్లు అందకపోవడంతో వృద్ధులు, దివ్యాంగులు, పింఛన్ల లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం వెంటనే పింఛన్ల డబ్బులను మంజూరు చేసి పింఛన్లు పంపిణీ చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు. పింఛన్ల పంపిణీ జరగని విషయమై నాగిరెడ్డిపేట సబ్‌పోస్టుమాస్టర్ ఆసిఫ్ అలీని ప్రశ్నించగా, ఇంతవరకు పెన్షన్ డబ్బులు రాలేవన్నారు. పెన్షన్ డబ్బులు రాగానే లబ్ధిదారులకు పంపిణీ చేస్తామని ఆయన తెలిపారు.

పెన్షన్ డబ్బులు ఇంకా రాలే..



● మంగలి అంజయ్య, దివ్యాంగ పెన్షన్ లబ్ధిదారుడు, నాగిరెడ్డిపేట

ఈనెలలో ఉగాది పండుగ వస్తుంది. పింఛన్ డబ్బులు వస్తాయి అనుకుంటే ఇంతవరకు రాలేదు. పండుగ పూట పింఛన్ డబ్బులు రాకపోవడంతో ఇబ్బందిగా ఉంది. ప్రభుత్వం పింఛన్ దారులు ఇబ్బందులు పడకుండా ప్రతీ నెల త్వరగా పింఛన్లను అందించాలి.

తాళం వేసి ఉన్న ఇళ్లే.. టార్గెట్

- అర్ధరాత్రి దాటాకే దొంగతనాలు
- కట్టర్లు, మరణాయుధాలతో గ్రామాల్లోకి ప్రవేశం
- వరుస ఘటనలతో పోలీసులకు సవాల్ విసురుతున్న దొంగలు



బస్వాపూర్‌లో మరణాయుధాలతో సంచరిస్తున్న వ్యక్తుల సీసీ కెమెరా పుటేజీ (ఫైల్)



బస్వాపూర్‌లో తాళం పగులగొట్టిన దృశ్యం

భిక్కనూరు, మార్చి28 (ఆంధ్రజ్యోతి): తాళం వేసి ఉంటే చాలు తెల్లారేసరికి ఆ ఇల్లును గుల్ల చేస్తున్నారు దొంగలు. చప్పుడు కాకుండా ఇరువైపులా ఇళ్లకు గొళ్లెం పెట్టి అందినకాడికి దోసుకుని పరారవుతున్నారు. సీసీ కెమెరాలు ఉన్నా రోడ్డు గుండాకాకుండా మరోవిధంగా తాళం వేసి ఉన్న ఇంటి వద్దకు చేరుకుని ఎలాంటి భయం లేకుండా దుండగులు దొంగతనాలు చేస్తూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు.

భిక్కనూరు మండలం బస్వాపూర్‌లో గురువారం అర్ధరాత్రి గ్రామంలో తాళం వేసి ఉన్న తొమ్మిది ఇళ్లల్లో చోరీచేసి బంగారం, వెండి, నగదును, బైక్‌ను ఎత్తుకెళ్లారు. ప్రతీ ఇంటి తాళాన్ని దొంగలు కట్టర్లతో కట్ చేసినట్లు ఉండటం, గ్రామంలో అక్కడక్కడా ఉన్న సీసీ కెమెరాల వైర్లను సైతం కత్తిరించడంతో వీరు పక్కా ప్రణాళికతోనే ఈ దొంగతనాలు చేసినట్లు గ్రామస్థులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. ఒకేరోజు తొమ్మిది ఇళ్లల్లో దొంగతనాలు జరగడంతో గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు.

పక్కా ప్లాన్‌తో దోచేస్తున్నారు..

గ్రామాల్లో తాళం వేసిన ఇళ్లనే ఎంచుకుని దొంగలు అందినకాడికి దొచుకుని పోతున్నారు. గ్రామాల్లో ఉదయం ఏదోఒక వస్తువులను అమ్ముకోవడానికి వచ్చినవారే ఇలాంటి చోరీలకు పాల్పడుతున్నట్లు ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. తాళం వేసి ఉన్న ఇళ్ల సమీపంలో సీసీ కెమెరాలు ఉంటే మరోమార్గాన్ని ఎంచుకుని ఆ మార్గం గుండానేవారు ఎంచుకున్న ఇంటి వద్దకు అర్ధరాత్రి దాటిన తర్వాతే చేరుకుని ఇంటి ఇరువైపులా ఉన్న ఇళ్లకు గొళ్లె పెట్టి ఏ చిన్నశబ్దం రాకుండా పక్కాప్లాన్‌తో దొంగతనాలకు పాల్పడుతున్నారు.

గతంలోనూ ఇదే తరహా ఘటనలు

బస్వాపూర్, సిద్దరామేశ్వరనగర్‌తో పాటుగా పలు గ్రామాల్లో సైతం ఇదే తరహా దొంగతనాలు చోటుచేసుకున్నాయి. జాతీయ రహదారిని అనుకుని ఉన్న గ్రామాలను ఎంచుకుని ఉదయం పూట రెక్కీ నిర్వహించి రాత్రివేళల్లో పెద్ద కట్టర్లు, మరణాయుధాలతో గ్రామాల్లోకి చేరుకుని దొంగలు దొంగతనాలకు పాల్పడుతున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొన్నినెలల ముందు ఇదే గ్రామంలో ఐదుగురు దుండగులు కట్టర్లు, మరణాయుధాలతో సంచరించగా సీసీ కెమెరాల్లో రికార్డైయ్యాయి. అదేరోజు సిద్ధరామేశ్వరనగర్ గ్రామంలో తాళం కట్‌చేసి లోనికి చొరబడి బంగారం నగదును దొంగలు ఎత్తుకెళ్లిన ఘటనలు ఉన్నాయి.

కేసు దర్యాప్తు చేస్తున్నాం..

● ఆంజనేయులు, ఎస్సై, భిక్కనూరు

బస్వాపూర్‌లో తొమ్మిది తాళం వేసి ఉన్న ఇళ్లలో దొంగతనం జరిగి కొంత బంగారం, నగదును దొంగలు దోచుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నాం. గ్రామంలోని సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నాం. ఇళ్లలో బంగారం, నగదును పెట్టి ప్రయాణాలు చేయవద్దు.

9 తులాల బంగారం, నగదు చోరీ

మండలంలోని బస్వాపూర్‌లో జరిగిన చోరీ ఘటనలో బంగారం, నగదు చోరికి గురైనట్లు పోలీసులు గుర్తించారు. తాళం వేసి ఉన్న గ్రామానికి చెందిన దాకి రమేష్, దాకి నాగమణి, మామిడి సత్తవ్వ, బాజే సుజాత, వంక సువర్ణ, మన్నె ధర్మరాజు, చింత చంద్రయ్య, చింత వినయ్, పోన్నాయిల స్వామి ఇళ్లలోకి చొరబడి సుమారు తొమ్మిది తులాల బంగారం, రూ.లక్షకు పైగా నగదును, లింగరాజు నవీన్‌కు చెందిన ద్విచక్రవాహన్ని దొంగలు ఎత్తుకెళ్లారు. కాగా దొంగలు పలువురి ఇళ్ల గుమ్మం వద్ద రూ.50 నోట్లను ఉంచారు. ఈ విషయం తెలుసుకున్న క్లూస్‌టీం గ్రామానికి చేరుకుని దొంగతనం జరిగిన ఇళ్లలో వేలిముద్రలను సేకరించారు.

అదనపు తరగతి గదులు నిర్మించరూ!

పెద్దకొడప్‌గల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం డీఎస్సీ ద్వారా ప్రభుత్వం ఆయా గ్రామాల పాఠశాలల్లో ఉపాధ్యాయుల నియామకం చేపట్టడంతో ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రయివేట్ బడులకు వెళ్లిన విద్యార్థులంతా నేడు ప్రభుత్వ బడులను వచ్చేశారు. దీంతో పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యలో పెరుగుదల నమోదైంది. అయితే మండలంలోని కుబ్యానాయక్ తండాలోని ప్రాథమిక పాఠశాల ఉండగా ఒక తరగతి గది ఉంది. ఈ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 40కి పైగా ఉండటంతో బోధనకు తరగతి ఇరుకుగా మారిందని తండావాసులు చెప్తున్నారు. పూర్తిస్థాయిలో విద్యార్థులు పాఠశాలకు హాజరైతే కూర్చోడానికి కష్టంగా మారుతుందని చెప్తున్నారు. కొన్ని తరగతులు విద్యార్థులు పాఠశాల లోపల కూర్చుంటే మరి కొంతమంది విద్యార్థులకు గది బయట కూర్చోబెట్టుకుని ఉపాధ్యాయులు బోధన చేస్తున్నారు. రానున్న విద్యాసంవత్సరానికి అయినా తండాలో అదనపు తరగతి గది నిర్మాణం చేయాలని తండా వాసులు కోరుతున్నారు.



కుబ్యా నాయక్‌తండాలో గల పాఠశాల

పేద విద్యార్థులకు వరం పీఎం ఇంటర్న్‌షిప్

- ఈనెల 31 వరకు ఆన్‌లైన్ దరఖాస్తుకు అవకాశం
- ఇంటర్న్‌షిప్ వ్యవధి 12 నెలలు
- మొదటి 6 నెలలు 5 వేల భత్యం
- వన్ టైం గ్రాంట్ రూ.6 వేలు

కామారెడ్డిటౌన్, మార్చి28 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకానికి రెండోదశ దరఖాస్తు ప్రక్రియ ఈనెల 31తో ముగియనుంది. 24 ఏళ్లలోపు యువత కోసం ఈస్కీంను కేంద్రప్రభుత్వం రూపొందించింది. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన ఎంతోమంది విద్యార్థులకు ఇది వరం లాంటిందని జిల్లా పరిశ్రమల శాఖ అధికారులు చెబుతున్నారు. జిల్లాలో పదోతరగతి ఆపై చదువుకున్న చాలామంది పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఈ ఇంటర్న్‌షిప్ స్కీంకు అర్హులు. గత మూడెళ్లలో ఖర్చుల ఆధారంగా అగ్రశ్రేణి కంపెనీలను గుర్తించారు. గ్యాస్, చమురు, ఇంధన రంగానికి ఇంటర్న్‌షిప్ పథకంలో నమోదుకోసం గరిష్ఠ అవకాశాలు ఉన్నాయని పేర్కొంటున్నారు. ఆ తర్వాత టూర్- ట్రావెల్, హస్పిటాలిటీ రంగంలో ఇంటర్న్‌షిప్ అవకాశాలు ఉన్నట్లు వివరించారు.

21 నుంచి 24 ఏళ్లవారు అర్హులు

పీఎం ఇంటర్న్‌షిప్ పథకానికి 10, 12వ తరగతి, ఐటీఐ, పాలిటెక్నిక్ డిప్లొమా, బీకాం, బీసీఏ, బీబీఏ,బీఫార్మాసీ చదివిన 21 నుంచి 24 ఏళ్ల మధ్య ఉన్న యువత దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్న్‌షిప్ కాలం 12 నెలలు కాగా ఇంటర్న్‌షిప్ కాలంలో కనీసం 6నెలల పాటు వ్యాపార వాతావరణంలో శిక్షణ అనుభవం లేదా ఆ తర్వాత ఉద్యోగ వాతావరణంలో గడపాల్సి ఉంటుంది. అర్హులైన అభ్యర్థులు పీఎంఇంటర్న్‌షిప్.ఎంసీఏ.జీవోవి.ఇన్ అనే వెబ్‌సైట్‌ను సందర్శించాలని అధికారులు సూచిస్తున్నారు. ఇంటర్న్‌షిప్ సమయంలో స్టైఫండ్‌గా రూ.5వేలు అందిస్తుండగా ఇందులో రూ.4500 కేంద్రప్రభుత్వం, రూ.500 కార్పోరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటి కింద సంబంధిత కంపెనీ అందిస్తుంది. 6నెలల తర్వాత వన్‌టైం గ్రాంట్ రూ.6 వేలు అందిస్తారు. కుటుంబ ఆదాయం రూ.8లక్షల లోపుఉండాలి. ప్రతీ ఇంటర్న్ కూడా ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, పీఎం జీవనజ్యోతి బీమా యోజన కింద బీమా చేయబడుతారు.

వీరు అర్హులు కారు

తల్లిదండ్రులు లేదా భార్యభర్తలు ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉన్నవారు లేదా కుటుంబ ఆదాయం రూ.8లక్షల కంటే ఎక్కువ ఉన్నవారు లేదా పూర్తిసమయం కోర్సులు చదువుతున్న యువకులు, ఐఐటీ, ఐఐఎం, నేషనల్ లా యూనివర్సిటీ, ఐఐఎస్ఈఆర్, ఎన్ఐటీ, ట్రిపుల్ఐటి వంటి సంస్థల నుంచి డిగ్రీలు పొందిన యువత దరఖాస్తులు ఈ పథకానికి అంగికరించబడవు. వృత్తిపరమైన డిగ్రీలు ఉన్నవారికి ఈ పథకం వర్తించదు. అలాగే ఏదైనా స్కిల్అప్రెంటిషిప్ ఇంటర్న్‌షిప్ చేసిన యువత ఈ పథకానికి అర్హులుకారు. కేంద్ర లేదా రాష్ట్ర ప్రభుత్వ విద్యార్థి శిక్షణ కార్యక్రమంలో భాగమైన యువత, నేషనల్ అప్రెంటిస్‌షిప్ ట్రైనింగ్ ప్రోగ్రాం లేదా నేషనల్ అప్రెంటిషిప్ ప్రమోషన్ స్కీమ్ కింద ఎప్పుడైన అప్రెంటిషిప్ పూర్తిచేసిన లేదా శిక్షణ పొందుతున్న యువత దరఖాస్తుకు అర్హులు కారు.

ఈనెల 31 వరకు దరఖాస్తుకు అవకాశం

● లాల్‌నాయక్, జిల్లా పరిశ్రమలశాఖ జీఎం



ఈ పథకానికి ఈ నెల 31 వరకు ఆన్‌లైన్ దరఖాస్తుకు అవకాశం ఉంది. దరఖాస్తు చేసుకుని ఎంపికైన యువతకు ఇంటర్న్‌షిప్ చేయడానికి కంపెనినీ కేటాయిస్తారు. ఆ తర్వాత జాబ్‌ఆఫర్ లెటర్లు అందించారికి కేటాయించిన కంపెనీల లో ఇంటర్న్‌షిప్ ప్రారంభిస్తారు. మొత్తం పథకంలో కేంద్ర ప్రభుత్వ రిజర్వేషన్ విధానం వర్తిస్తుంది. ఈ పథకం కింద వచ్చే ఐదేళ్లలో దేశంలో టాప్ 500 కంపెనీలలో ఇంటర్న్‌షిప్ ఇవ్వడం ద్వారా దేశవ్యాప్తంగా కోటిమంది యువత శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారు. దరఖాస్తు చేయడానికి ఆధార్‌కార్డు, పాస్ పోర్టు సైజ్ ఫోటో, విద్యార్హత ధృవపత్రాలు తప్పనిసరి. 21 నుంచి 24 సంవత్సరాల వయస్సు గల యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ చైతన్యరెడ్డి

హత్యకేసులో ఐదుగురి అరెస్ట్

● రమేష్ కాళ్లు, చేతులు కట్టేసి చితకబాదిన నిందితులు
● ఏం తెలియనట్టు పోలీసులకు ఫోన్ చేసి చెప్పారు..
● వివరాలు వెల్లడించిన ఏఎస్పీ చైతన్యరెడ్డి

కామారెడ్డిటౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): దోమకొండ మండలం ముత్యంపేటకు చెందిన ఈరవేని రమేష్ హత్య కేసులో ఐదుగురు నిందితులను అరెస్టు చేసినట్టు ఏఎస్పీ చైతన్యరెడ్డి తెలిపారు. శుక్రవారం కామారెడ్డిలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఏఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. ముత్యంపేట గ్రామానికి చెందిన రమేష్ తన భార్య పేరిట మారుతి స్విఫ్ట్ కారును లోన్ తీసుకొని కొనుగోలు చేశాడు. తర్వాత ఈ కారును చింతమన్‌పల్లి గ్రామానికి చెందిన పల్లె పోచయ్యకు రూ.3లక్షల 85 వేలకు ఇటీవల విక్రయించాడు. దీంతో పోచయ్య రూ.1లక్ష 36 వేలు రమేష్‌కు నగదు ఇచ్చి.. ఆ తర్వాత నుంచి రూ.65,750 ఫైనాన్స్ చెల్లిస్తూ వస్తున్నాడు. ఇవి పోను మిగిలిన డబ్బులు ఇవ్వాలని పోచయ్యను రమేష్ అడగడంతో మొత్తం ఫైనాన్స్ క్లియర్ చేసి ఇస్తేనే డబ్బులు చెల్లిస్తానని తేల్చి చెప్పారు. ఈ విషయమై ఇద్దరి మధ్య పలుమార్లు గొడవ జరిగింది. ఈ నెల 25వ తేదీన రమేష్, తన భార్య అనిత, పోచయ్య ముగ్గురూ కలిసి ఫైనాన్స్ క్లియర్ చేసేందుకు కామారెడ్డికి రాగా.. మొత్తం రూ.1లక్ష 85 వేలు చెల్లిస్తే ఫైనాన్స్ క్లియర్ అవుతుందని చెప్పడంతో పోచయ్య దాని కి ఒప్పుకుని నాలుగైదు రోజుల్లో డబ్బులు చెల్లిస్తానని చెప్పాడు. ఈ నెల 26న పోచయ్య వద్దకు రమేష్ వెళ్లి డబ్బులు మొత్తం తనకే ఇవ్వాలని, అప్పుడే ఫైనాన్స్ క్లియర్ చేస్తానని చెప్పగా.. మరోసారి ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో గురువారం చింతమాన్ పల్లిశివారులో గల తన ఇటుక బట్టి వద్ద కారు నిలిపిన పోచయ్య.. తన గదిలో ఫోన్ చూస్తుండగా తెల్లవారు జామున 3 గంటల ప్రాంతంలో కారు ఓపెన్ అయిన శబ్దం వచ్చింది. దీంతో పోచయ్య బయటకు వచ్చి చూడగా రమేష్ కారును తీసు కుని వెళ్తున్నాడు. వెంటనే కారును ఆపిన పోచయ్య రమేష్‌తో గొడవకు దిగగా.. అక్కడే పనిచేస్తున్న కూలీలు వచ్చి విడిపించారు. వెంటనే పోచ య్య పక్కనే ఉన్న కర్రను తీసుకుని రమేష్ తలపై బలంగా కొట్టాడు. కింద పడిపోయిన రమేష్‌ను ఎలాగైనా చంపాలన్న ఉద్దేశ్యంతో కాళ్లు, చేతులు కట్టేసిన పోచయ్య.. తన అల్లుడు, కూలీలతో కలిసి విపరీతంగా కొట్టారు. ఆ తర్వాత తమకు ఏమి తెలియనట్లు రమేష్ కులస్తుడు రాములుకు ఫోన్‌చేసి రమేష్ ఇక్కడ పడి ఉన్నాడని చెప్పాడు. ఆ తర్వాత 100 కు కాల్‌చేసి ఇక్కడ గొడవ జరుగుతుందని చెప్పి అక్కడి నుంచి పారిపోయారు. పోలీసులు వచ్చి కింద పడి ఉన్న రమేష్‌ను ఆసుపత్రికి తరలిస్తుండగా.. మార్గ మధ్యలో మృతిచెందాడని ఏఎస్పీ వివరించారు. రమేష్ హత్యకు కారణమైన పోచయ్య, అతని అల్లుడు హరీష్, ఇటుక బట్టి కూలీలు రాజ్‌కుమార్, రమేష్, బిదేశినాయక్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఏఎస్పీ తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో భిక్కనూరు సీఐ సంపత్, దోమకొండ ఎస్సై స్రవంతి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

జోరుగా కొనసాగుతున్న ఉపాధి పనులు

దోమకొండ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో ఉపాధిహామీ పనులు కొనసాగుతున్నట్లు ఏపీవో రజని శుక్రవారం తెలిపారు. దోమకొండలోని గుండ్ల చెరువులో 177 మంది కూలీలు చేపల చెరువు పనులు చేస్తున్నట్లు తెలిపారు. అయితే కూలీలు నీటి సదుపాయం లేదని నాయకుల దృష్టికి తీసుకెళ్లడంతో మాజీ జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సీతారాం మధు పని ప్రదేశానికి వెళ్లి ఏపీవోతో ఫోన్‌లో మాట్లాడి కూలీలకు నీటి సదుపాయం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎఫ్ఏ లింగం పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిలో డబుల్ ఇళ్ల సర్వే ప్రారంభం

ఎల్లారెడ్డి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కోసం వచ్చిన వచ్చిన దరఖాస్తులను శుక్రవారం రెవెన్యూ అధికారులు ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో విచారణ ప్రారంభించినట్లు ఎల్లారెడ్డి తహసిల్దార్ ప్రేమ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులను గుర్తించేందుకు సర్వేని ప్రారంభించినట్లు తెలిపారు. సర్వే నివేదికను ఉన్నతాధికారులకు పంపిన తర్వాత లబ్ధిదారుల జాబితా త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు. సర్వేలో గిర్ధావార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

కామారెడ్డిటౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రంలో గిరిజన నాయకులు గురువారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం గోరుబోలి భాషను భారత రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చేందుకు ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపడం హర్షించదగిన విషయమని అన్నారు. దేశంలో 15 కోట్ల మంది,రాష్ట్రంలో 40 లక్షల మంది బంజారా నాయకులు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాణాప్రతాప్‌రాథోడ్, ఆల్ ఇండియా బంజారా సేవ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి మోతిసింగ్, లంబడా హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు నూనావత్ గణేష్‌నాయక్, బంజారా సేవా సంఘం ఉద్యోగుల జిల్లా అధ్యక్షులు మోతిరాం, యువజన అధ్యక్షుడు ఆనంద్ నాయక్, జిల్లా ఉపాధ్యాక్షుడు వినోద్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

'రైతుల బోనస్ డబ్బులు కాజేసిన వారిపై చర్యలు తీసుకోవాలి'

బాన్సువాడ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రైతుల బోనస్ డబ్బులు కాజేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఐ నేత దుబాస్ రాములు డిమాండ్ చేశారు. శుక్రవారం బాన్సువాడ సిపిఐ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. కోటగిరి రైతులకు చెందాల్సిన వడ్ల బోనస్ డబ్బులు సుమారుగా రూ. 20 లక్షలు నొక్కేశారని, సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శివాజీ, నాగరాజు, వెంకటి, రాజు పాల్గొన్నారు.

ఉగాది సందర్భంగా శోభాయాత్ర

మద్నూర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): అనంత శ్రీ విభూషిత జగద్గురు రామానంద చార్య శ్రీ స్వామి నరేంద్ర చార్యజీ మహారాజ్ ఆశీర్వాదాలతో, కానిఫ్ నాథ్ మహారాజ్ ఆశీస్సులతో ఉగాది నూతన సంవత్సర స్వాగత శోభయాత్ర ఆదివారం 30న మద్నూర్ మండల కేంద్రంలో జరగనుందని తెలంగాణ ఉపపీఠం నిర్వాహకులు తెలిపారు. మద్నూర్ మండల కేంద్రంలో ఆదివారం ఉదయం 9 గంటలకు గాంధీ చౌక్ నుంచి ఉగాది హిందూ నూతన సంవత్సర స్వాగత శోభయాత్ర ప్రారంభం అవుతుందని, ఈ శోభయాత్రలో పాల్గొని స్వామిజీకి కృపకు ప్రాప్తులు కావాలని కోరారు. ఈ శోభయాత్ర గాంధీ చౌక్ నుంచి కార్మెల్ స్కూల్ వరకు జరుగుతుందని తెలిపారు.

ప్రశాంతంగా కొనసాగుతున్న పదో తరగతి పరీక్షలు

● మద్నూర్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన డీఈవో

మద్నూర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : జుక్కల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పరీక్ష కేంద్రం నుంచి గణిత శాస్త్రం పత్రంలోని కొన్ని ప్రశ్నలు లీకైన సందర్భంగా విద్య, పోలీసు శాఖ కట్టుదిట్టమైన ఏర్పాట్లను చేసింది. జుక్కల్ నియోజకవర్గంలోని ఆయా పరీక్ష కేంద్రాలలో పోలీసులు అధికారులు నిఘా ఏర్పాటు చేశారు. మద్నూర్ మండల కేంద్రంలో పదవ తరగతి పరీక్షలకు సంబంధించి మూడు కేంద్రాలను ఏర్పాటు చేయగా మూడు కేంద్రాల వద్ద 12 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి రాజు పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. మద్నూర్ మండలంలో పదవ తరగతి విద్యార్థులు 16 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 684 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా శుక్రవారం 682 మంది పరీక్షలను రాశారు.

పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన ఫ్లయింగ్ స్క్వాడ్

ఎల్లారెడ్డి: పట్టణ కేంద్రంలో జరుగుతున్న పదో తరగతి పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో జరుగుతున్న పరీక్ష కేంద్రాన్ని ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులకు ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించారు. ఆయనతోపాటు ఎంఈవో వెంకటేశం ఉన్నారు.

దోమకొండ: మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ బాలుర, జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో పదవ తరగతి పరీక్షలు కొనసాగుతున్నాయి. ఎలాంటి సంఘటనలు జరుగకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. ఎస్సై స్రవంతి ఆధ్వర్యంలో రెండు కేంద్రాల వద్ద పోలీసులతో బందోబస్తును ఏర్పాటు చేశారు.



ఎల్లారెడ్డిలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్

రామారెడ్డి: ప్రభుత్వం ప్రశాంతంగా నిర్వహిస్తున్న 10వ తరగతి పరీక్షలను రామారెడ్డి ఎంఈవో నిట్టపు ఆనంద్ రావు, ఎస్సై నరేష్ పర్యవేక్షణలో నిర్వహించారు. శుక్రవారం రామారెడ్డి మండల కేంద్రంతో పాటు రెడ్డిపేట్, ఉప్పల్వాయి పరీక్ష కేంద్రాల వద్ద వసతులు పరిశీలించారు.

ఓటీఎస్ గడువును పొడిగించాలని ఏకగ్రీవ తీర్మానం

నిజాంసాగర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రైతులు తీసుకున్న దీర్ఘకాలిక రుణాల ఓటీఎస్ కాల పరిమితిని మరో మూడు నెలల పాటు పొడిగించాలని అచ్చంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం శుక్రవారం ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. చైర్మన్ నరసింహారెడ్డి అధ్యక్షతన మహాజనసభ నిర్వహించారు. ఈ సభలో సెప్టెంబరు 2024 ఫిబ్రవరి 2025 వరకు సంఘ జమ ఖర్చులను ముఖ్య కార్యనిర్వాహణాధికారి సంఘగౌడ్ సభ్యులకు చదివి వినిపించారు. ఈ సందర్భంగా మహాజనకు హాజరైన పాలకవర్గం రైతులు ఓటీఎస్ ఈనెల 31తో ముగుస్తుందని రైతుల వద్ద పంటలు చేతికొచ్చే వరకు డబ్బుల ఉన్నాయని ఈ ఓటీఎస్ కాల పరిమితిని మరో మూడు నెలల పాటు పొడిగించాలని డిమాండ్ చేశారు. రైతుల పాలకవర్గం పరిగణలోకి తీసుకుని డీసీసీ బ్యాంకు అధికారులకు ఏకగ్రీవంగా తీర్మానం చేసి పంపారు. మరో మూడు నెలల పాటు పొడిగించినట్లయితే రైతులకు ఎంతో మేలు జరుగుతుందని వారు విజ్ఞప్తి చేశారు. సంఘంలో 392 మంది రైతులకు కోటి 65 లక్షల రుణమాఫీ జరిగిందని, 382 రైతులకు తిరిగి రూ. కోటి 80 లక్షల రుణాలు ఇవ్వడం జరిగిందని చైర్మన్ నరసింహారెడ్డి తెలిపారు. ఈ సమావేశంలోయ విండో ఉపాధ్యక్షుడు శ్రీనివాస్,పాలక వర్గసభ్యులు, రైతులు ఉన్నారు.



మహాజన సభలో మాట్లాడుతున్న చైర్మన్ నరసింహా రెడ్డి

సొసైటీ వైస్ చైర్మన్ అంబర్‌సింగ్‌కు నివాళి

బాన్సువాడ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మండలం దేశాయ్ పేట్ సొసైటీ ఉపాధ్యక్షులు అంబర్ సింగ్ గత మూడు రోజుల క్రితం గుండె పోటుతో మరణించడంతో శుక్రవారం సొసైటీ కార్యాలయంలో డీసీసీబీ మాజీ చైర్మన్, సొసైటీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి పాలక వర్గం సభ్యులతో కలిసి అంబర్ సింగ్ చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ పాలకవర్గం సభ్యులు ప్రజాప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ నిరసన

కామారెడ్డిటౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణ బిల్లు-2024 ను వ్యతిరేకిస్తు శుక్రవారం తహసీల్ మసీదులో ముస్లింలు నల్లబ్యాడ్జిలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అల్విదా జూమా సందర్భంగా దేశవ్యాప్తంగా ఉన్న ముస్లింలు చేతికి నల్లబ్యాడ్జిలు కట్టి ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపునిచ్చిన నేప థ్యంలో ప్రార్థన అనంతరం నిరసన తెలిపినట్లు ముస్లింలు పేర్కొన్నారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం

బిచ్కుంద, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని భద్రల్ తండాలో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు మల్లికార్జున్ అప్ప మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం కావాల్సిన నిధులను మంజూరుచేస్తుందని తెలిపారు. ఎమ్మెల్యే కృషితో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.5లక్షలుమంజూరు అయ్యాయని తెలిపారు. ప్రభుత్వం బిచ్కుందను మున్సిపాలిటిగా మార్చడంతో మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంగాధర్, నౌషానాయక్, శంకర్‌నాయక్, రాజుపటేల్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

నిజాంసాగర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కింద నిర్మాణం చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణం పనులను ఉపాధిహామీ హాస్టల్ ప్రాజెక్టు డైరెక్టర్ వామన్‌రావు ఎంపీడీవో గంగాధర్, ఏపీవో కుమార్ శుక్రవారం పరిశీలించారు.

అక్రమ వడ్డీ వ్యాపారం చేస్తున్న వారిపై కేసులు

గాంధారి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): గాంధారి మండలంలోని తిప్పారం గ్రామంలో ఎలాంటి లైసెన్స్‌లు లేకుండా అక్రమంగా వడ్డి వ్యాపారం చేస్తున్న వారిపై కేసులు నమోదుచేసినట్లు ఎస్ఐ ఆంజనేయు లు తెలిపారు. గ్రామంలో సాయిరాం, ఆనంద్‌రావు, బాలయ్య మొదలగు వారి వద్ద ప్రామిసరి నోట్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

జుక్కల్ నియోజకవర్గానికి రూ.11కోట్ల నిధులు మంజూరు

జుక్కల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): జుక్కల్ నియోజకవర్గంలో వివిధ మండలంలోని గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.11 కోట్లు మంజూరైనట్లు కాంగ్రెస్ పార్టీ నాయకుడు రమేష్‌దేశాయ్ తెలిపారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు కృషితో ఈజీఎస్ నిధుల నుంచి రూ.11 కోట్లు మంజూరుకావడం గర్వకారణమని తెలిపారు. మండలాన్ని అభివృద్ధిచేయడానికి ఎమ్మెల్యే కృషిచేస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే అభ్యర్థనలతో రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గానికి నిధులు కేటాయించడంతో పాటు ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు, నిరుద్యోగులకు, ప్రజలకు సంక్షేమపథకాలు, వృద్ధులకు పెన్షన్ అమలుచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఒకేదేశం - ఒకే ఎన్నికపై ప్రజలకు వివరించాలి

రాజంపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో ఒకే దేశం- ఒకే ఎన్నికపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బీజేవైయం జిల్లా అధ్యక్షుడు నంది వేణు మాట్లాడుతూ ఎన్నికలు ఒకేసారి నిర్వహించడం వల్ల ఆర్థికంగా ఎంతో ఖర్చు ఆదా అవుతుందని, రాజకీయ పార్టీలకు పోటిచేసే అభ్యర్థులకు కూడా ఆర్థికంగా ఖర్చు తక్కువ అవుతుందని అన్నారు. కాంగ్రెస్ ఇతర ప్రతి పక్షాల నేతలు ఎన్ని కుట్రలు చేసిన దేశానికి ఉపయోగపడే ఈ బిల్లు కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టనుందని తెలిపారు. ప్రతీ బీజేపీ కార్యకర్త ఈ అంశంపై ప్రజలకు వివరించాలని ప్రతిపక్షాల ఆరోపణలు తిప్పి కొట్టాల న్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు విపుల్‌జైన్, సంపత్ రెడ్డి, సంధ్య, గంగారెడ్డి, సాయిరెడ్డి, రాములు, సంతోష్, సతీష్ పాల్గొన్నారు.

సొసైటీ అభివృద్ధిపైనే దృష్టి

బిచ్కుంద, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : రైతు సేవా సహకార సంఘం అభివృద్ధి చేయడానికి ప్రత్యేక దృష్టిపెట్టడం జరుగుతుందని చైర్మన్ నల్బార్‌బాలు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సొసైటిలో 58వ రైతుసేవాసహకార సంఘం మహాజన సభ చైర్మన్‌నాల్బార్ బాలాజీ అధ్యక్షతన నిర్వహించారు. జమఖర్చుల లావాదేవిలను సొసైటి కార్యదర్శి శ్రావణ్ సమావేశంలో రైతులకు తెలియజేశారు. రుణాలు పొందిన రైతుల సకాలంలో రెన్యూవల్ చేయకపోవడం వల్ల తీసుకున్న రుణానికి వడ్డీ పెరిగిపోవడంతో రుణమాఫీ వర్తించకపోవడానికి కారణమైంద న్నారు. దాదాపు 1200 మంది రైతులకు గాను 337 మందికి మాత్రమే రుణమాఫీ వచ్చినట్లు మిగిలిన వారిని ఏకకాలంలోరుణమాఫీచేయాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో సొసైటి మేనేజింగ్ డైరెక్టర్ క్రాంతికుమార్, వైస్‌చైర్మన్ యాదవ్‌డైరెక్టర్‌లు సంజు, అశోక్, శంకర్‌నాయక్, శివరాజ్ యాదవ్, చంద్రకాంత్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు.

దళారులకు వరి ధాన్యాన్ని విక్రయించి రైతులు మోసపోవద్దు

● డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి

బాన్సువాడ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ధాన్యాన్ని మధ్య దళారులకు విక్రయించి మోసపోవద్దని డీసీసీబీ మాజీ చైర్మన్, దేశాయిపేట్ సొసైటీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి అన్నారు. శుక్రవారం బాన్సువాడ మండలం దేశాయ్ పేట్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పోచారం భాస్కర్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎటువంటి నష్టం జరగకూడదని రైతు పండించిన ప్రతీ గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని ఆయన తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఉన్న సన్నం రకం ధాన్యానికి ప్రోత్సాహకంగా క్వింటాలుకు రూ.500 బోనస్ ఇవ్వడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగ పరచుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సొసైటి పాలక వర్గం సభ్యులు ప్రజాప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది

బాన్సువాడటౌన్: రైతులు పండించిన ప్రతీ గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తోందని ఉమ్మడి నిజామాబాద్ మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని దేశాయిపేట సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం నిబంధనలకు లోబడి ఉన్న సన్నరకం ధాన్యానికి ప్రోత్సాహకంగా క్వింటాలుకు 500 బోనస్ ఇవ్వడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకుల తదితరులున్నారు.



వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న భాస్కర్‌రెడ్డి

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

● ఏఎంసీ చైర్‌పర్సన్ సౌజన్య

మద్నూర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రైతులు పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకొని తమ పశువులకు చికిత్సలు చేయించుకోవాలని మద్నూర్ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ సౌజన్య సూచించారు. శుక్రవారం డోంగ్లి మండల కేంద్రంలో పశువైద్య శిబి రాన్ని ఆమె ప్రారంభించారు. మద్నూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరాలను నిర్వహి స్తున్నట్లు వెల్లడించారు. పాడి లేనిదే వ్యవసాయం లేదని పశువుల పెంపకందారులు ఈ శిబిరాలలో తమ పశువులకు చికిత్సలు చేసుకొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మార్కెట్ కమిటీ ఉపా ధ్యక్షులు పరమేష్ పటేల్ మాట్లాడుతూ ఎమ్మెల్యే తోటా లక్ష్మీకాంత రావు ఆదేశాల మేరకు మద్నూర్ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో పశువుల రోగ నివారణ కోసం ఉచిత పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. మద్నూర్ మార్కెట్ కమిటీ పరిధిలోని జుక్కల్, మద్నూర్, డోంగ్లి మండలాల్లో పశు వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యులు, సిబ్బంది, మాజీ ఎంపీటీసీ దీన్‌దయాల్, నాయకులు శివాజీ పటేల్, ఆనంద రావు పటేల్, తదితరులు పాల్గొన్నారు.



డోంగ్లి మండల కేంద్రంలో పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ చైర్ పర్సన్

మళ్లీ తెరపైకి.. పోస్టుల భర్తీ లొల్లి!

(5వ పేజీ తరువాయి...)

నేపథ్యంలో కొత్త నోటిఫికేషన్ వేసి భర్తీచేట్టాల్సి ఉండగా.. ఎందుకు నోటిఫికేషన్ వేయకుండా పాత నోటిఫికేషన్ ద్వారా భర్తీ ప్రక్రియ చేపట్టారని నిబంధనలు అతిక్రమించడంతో మాకు అన్యాయం జరిగిందని పలువురు నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డబ్బులకు పోస్టులను అమ్ముకున్నారా?

తమకు న్యాయంగా రావాల్సిన పోస్టులను ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ నిర్వాహకులు, పలువురు కళాశాలలోని సిబ్బంది కలిసి పోస్టులను అమ్ముకున్నారని పలువురు నిరుద్యోగులు ఆరోపించారు. అసలు మెరిట్ లిస్టు ప్రదర్శించకుండా, అభ్యంతరాలు తీసుకోకుండా ఫోన్‌ల ద్వారా సంప్రదిస్తూ.. రెండు రోజులలో నియామక పత్రాలు తీసుకోవాలని ఎలా ప్రకటిస్తారని ప్రశ్నిస్తున్నారు. శుక్రవారం ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ నిర్వాహకులు పోస్టులను అమ్ముకున్నారని.. మొదట కొందరి వద్ద రూ.లక్ష నుంచి రూ.3లక్షల వరకు డబ్బులు తీసుకుని అందులో ఎక్కువ ఎవరు ఇస్తేవారికి ఉద్యోగం కేటాయించి మిగిలిన వారికి తిరిగి చెల్లించారని పేర్కొంటూ నిరుద్యోగులతో పాటు విద్యార్థి సంఘా నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ ఆఫీస్ వద్ద పలువురు దరఖాస్తుదారులు శుక్రవారం ఉదయం నిరసన సైతం తెలిపినట్లు సమాచారం. మరికొందరు రూల్ ఆఫ్ రిజర్వేషన్‌లో రేడియాలజిస్ట్ పోస్టుకు మహిళా అభ్యర్థి దరఖాస్తు చేసుకోవాల్సి ఉండగా.. మహిళలు ఎవరూ దరఖాస్తు చేసుకోకపోతే మెరిట్ ఉన్నవారికి ఇవ్వాల్సి ఉండగా మరో వ్యక్తికి ఇచ్చారన్నారు. అలాగే దోబీ పోస్టుకు అనుభవం కావాలి, కానీ మార్కుల ఆధారంగా ఉద్యోగం కేటాయించారన్నారు. అలాగే డీఈవో పోస్టులకు స్కిల్స్ చూడాల్సి ఉండగా.. సంబంధంలేకుండా డిగ్రీలో మెరిట్ చూసి ఇచ్చారని, ఇలా అనేక రకాలుగా వారికి నచ్చిన విధంగా ఉద్యోగాలు భర్తీ చేశారని ఆరోపణలు నిరుద్యోగుల నుంచి వస్తున్నాయి. రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించకుండానే తిరిగి పోస్టులను భర్తీ చేశారని, ఇన్‌చార్జి మంత్రి చెప్పినా ఉద్యోగ నియామకాలలో మళ్లీ పొరపాట్లు చేస్తూ అసలైన వారికి చివరకు అన్యాయమే చేశారని ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయంపై జిల్లా ఇన్‌చార్జి మంత్రితో పాటు ఉన్నతాధికారులు ఏ విధంగా స్పందిస్తారో వేచిచూడాలి మరీ!!

విద్యార్థులు వేసవి సెలవుల్లో జాగ్రత్తలు తీసుకోవాలి

● ఎల్లారెడ్డి ఎస్సై బొజ్జ మహేష్

ఎల్లారెడ్డి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వేసవి సెలవులలో జాగ్రత్తలు తీసుకోవాలని అదేవిధంగా మైనర్ డ్రైవింగ్ చేయడం చట్టరీత్య నేరం అని ఎల్లారెడ్డి ఎస్సై మహేష్ అన్నారు. శుక్రవారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో షీ టీం కళాబృందంచే అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ వేసవి సెలవులలో ఇంటికి వెళ్లినప్పుడు అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని, విద్యార్థులు చెరువులకు ఈతకు వెళ్లి ప్రాణానికి తెచ్చుకోవద్దని సెలవు దినాల్లో జరిగే దొంగతనాలను నివారించాలని అత్యవసర సమయంలో వంద నెంబర్‌కు కాల్ చేయాలని సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం సభ్యులు పోలీసులు కళాబృందం సభ్యులు పాఠశాల ప్రిన్సిపాల్ సావిత్రి, పుష్ప, ఉపాధ్యాయ బృందం సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేయాలి

రాజంపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్గొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో శుక్రవారం చైర్మన్ శివరాములు ఆధ్వర్యంలో మహాజన సభ నిర్వహించారు. జమఖర్చుల వివరాలను సెక్రటరీ సాయిలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా రుణమాఫీ కాని రైతులకు రుణమాఫీ ఏకకాలంలో చేయాలని ప్రభుత్వానికి తెలిసేలా ఏకగ్రీవంగా ఆమోదం తెలిపినట్లు చైర్మన్ వివరించారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్‌లు మల్లారెడ్డి, రాజిరెడ్డి, మధుకర్, చిన్నసాయిలు, మాలి, దుర్గారెడ్డి పాల్గొన్నారు.

బావిలో దూకి మహిళ ఆత్మహత్య

గాంధారి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొతంగల్ ఖుర్ధు గ్రామానికి చెందిన పుప్పాల భాగ్యలక్ష్మీ(45) బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. గత 18 సంవత్సరాల క్రితం అదే గ్రామానికి చెందిన రాములు అనే వ్యక్తిని వివాహం చేసుకుని జీవిస్తుండగా, గత కొంతకాలంగా టీబీరోగంతో బాధపడుతూ దగ్గు,దమ్ము, విపరితంగా రావడం, పిల్లలు లేకపోవడంతో మనస్థాపానికి గురై గురువారం రాత్రి ఇంటికి బయట గొల్లెం పెట్టి గ్రామశివారులో గల కిషన్‌రావు బావిలో దూకి ఆత్మహత్యచేసుకుందని తెలిపారు. భాగ్యలక్ష్మీ మృతిపై కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదుచేసి దర్యాప్తుచేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

నసురుల్లాబాద్‌లో ఇఫ్తార్ విందు

నసురుల్లాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రంజాన్ ఉపవాస వేల ముస్లిం సోదరులకు మండల కేంద్రంలోని ఉర్దూ మీడియం పాఠశాలలో శుక్రవారం ప్రభుత్వం తరఫున ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పెర్క శ్రీనివాస్ మాట్లాడుతూ మైనారిటీ సోదరులకు ఉపవాస దీక్షలో భాగంగా ప్రభుత్వం ఇఫ్తార్ విందును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు మాజీ ఎంపీటీసీ కందిమల్లేష్, తాహసిల్దార్ ప్రవీణ్ కుమార్, ముస్లిం సోదరులు యూసుఫ్, మజీద్, లాయక్, ఆరిఫ్ పాల్గొన్నారు.

పిట్లం: స్థానిక భారత్ హాల్ ఫంక్షన్‌హాల్‌లో కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో జుక్కల్ నియో.కవర్గ మైనార్టీ సోదరులకు ఇఫ్తార్ విందు ఎర్పాటు చెశారు. శుక్రవారం ఇఫ్తార్ విందు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జుక్కల్ ఎమ్మెల్యే తోటలక్ష్మి కాంతారావ్ హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీల అభివృద్ధికి కృషి చెస్తుందన్నారు. మైనార్టీలు పవిత్రమైన రంజాన్ మాసంలో నెల రోజుల పాటు దీక్షలు ఉండి ప్రార్థనలు చే స్తారన్నారు. మజీద్ కమిటి సదర్ యాదుల్, జుక్కల్ నియోజకవర్గ అస్లెంబ్లీ అధ్యక్షుడు ఇమ్మురోజ్, ఇఫ్తార్ విందుకు విచ్చెసిన ఎమ్మెల్యేకు శాలువా,పూల మాలతో సన్మాణం చెశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ మైనార్టీలు, ప్రజా ప్రతినిదులు, అధికారులు, ఎయంసి చైర్మెన్ మనోజ్‌కుమార్, వైస్ చైర్మెన్ కృష్ణారెడ్డి, విండో చైర్మెన్ శపథంరెడ్డి, నాయకులు హన్మండ్లు, రాంరెడ్డి, కృష్ణారెడ్డి, మొహన్‌రెడ్డి, మోయిన్, షకీల్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక రవాణాపై నిఘా

రాజంపేట, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండారం, నడిమి తండా, ఎల్లాపూర్ తండా గ్రామాల పరిధిలో ఇసుక అక్రమరవాణాపై మంగళవారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. గురువారం రాత్రి తహసీల్దార్ సతీష్‌రెడ్డి, పోలీసులతో కలిసి అక్రమ ఇసుక తరలిస్తున్న వాగులను పరిశీలించారు. ఎవరైన అక్రమంగా ఇసుక తరలిస్తే కఠినచర్యలు తీసుకుంటామని తెలిపారు. వాల్టాచట్టం ప్రకారం అనుమతులు తీసుకుని పనులుచేయించాలని అనుమతులు లేకుండా అక్రమ ఇసుక తరలిస్తే కేసులు నమోదుచేసి చర్యలు తీసుకుంటామన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ లక్ష్మయ్యసిబ్బంది పాల్గొన్నారు.

కొచ్చెరి మైసమ్మ ఆలయంలో పూజలు

నసురుల్లాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): నసురుల్లాబాద్ మండలం మైలారం గ్రామ శివారులో గల కొచ్చేరి మైసమ్మ ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు..ఆలయానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కాకుండా వివిధ మండలాల భక్తులు వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు..



సినిమా గైడ్ కామారెడ్డి

కామారెడ్డి	
దర్శన్	- ఫైర్
ప్రియా 70	- పెళ్లికాని ప్రసాద్
ప్రియా 35	- ఛావా

బాన్సువాడ	
మహేశ్వరి	- కోర్ట్
వెంకటేశ్వర	- షణ్ముఖ



చికెన్ ధరలు

రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	120	140	170
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

